# లోక్‌సత్తా పార్టీ

## కొన్ని ప్రశ్నలు - వివరణలు

డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

# లోక్‌సత్తా పార్టీ
# కొన్ని ప్రశ్నలు - వివరణలు

**1. ఒక ప్రజా ఉద్యమంగా లోక్‌సత్తా ఎన్నో విజయాలు సాధిస్తున్నది. ఇప్పుడు మీరు రాజకీయ పార్టీని ప్రారంభించాల్సిన అవసరం ఏమిటి?**

లోక్‌సత్తా ఇవ్వాళ దేశంలో ప్రజాస్వామ్యంలో సంస్కరణల కోసం కృషి చేస్తున్న అతి పెద్ద సంస్థ. ఈ ఉద్యమ ఫలితంగా కొన్ని ఫలితాలు వచ్చాయి. పాలనలో కొన్ని మార్పులు కూడా వచ్చాయి. అలాగే జనంలో కొంత ఆదరణ, ఇలాంటి మార్పులు రావాలని ఆశ , ఇవన్నీ వున్నమాట వాస్తవం. కానీ రెండు విషయాలు స్పష్టంగా బోధపడుతున్నాయి. ఆటనియమాలు మారకుండా ఆటగాళ్ళు మారినంత మాత్రం చేత ప్రయోజనం లేదని లోక్‌సత్తా మొదటి నుంచి చెబుతూనే వుంది. నాడు,నేడు కూడా దానికే కట్టుబడి ఉన్నది. అయితే కొన్ని విషయాలు ఏం చెపుతున్నాయంటే ; మొట్ట మొదటిది ఈ దేశంలో లోక్‌సత్తా చేస్తున్న కృషివల్ల గాని, ఇతర ప్రజా ఉద్యమాల ప్రయత్నాల వల్లగాని, పార్టీల్లో విజ్ఞుల శ్రమ వల్లగాని, కొన్ని నిర్దిష్టమైన ఫలితాలు వచ్చాయి, వస్తున్నాయి. ఉదాహరణకు ఓటర్ల జాబితాలో అవకతవకలు కొంతమేర తగ్గుతున్నాయి. పూర్తిగా బాగుచేయటం కోసమని పోస్టాఫీసుని శాశ్వత ప్రాతిపదికన నోడల్ ఏజన్సీగా ఏర్పాటు చేసే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. అలాగే లోక్‌సత్తా చేస్తున్న కృషివల్ల ఈవేళ నేరచరితుల వివరాలు బయటపెట్టడమనేది చట్టబద్ధంగా వచ్చింది. కొత్త నేరస్తుల్ని పార్టీలో తీసుకోవడానికి జంకుతున్నాయి. అన్నిటికంటే కీలకమైనది, ఇంకా దాని ప్రభావం ప్రజలు చూడంది, ఎన్నికల నిధుల చట్టంలో మౌలికమైన మార్పులు లోక్‌సత్తా తీసుకువచ్చింది. అలాగే పార్టీ ఫిరాయింపుల నిషేధాన్ని మరింత కఠినతరం చేయడంగానీ, పార్లమెంటు లేక శాసనసభ సభ్యుల సభ్యత్వంలో 15% మాత్రమే మంత్రులుగా వుండేట్టు ఏర్పాటు చేయడంగానీ రాజ్యాంగబద్ధంగా ఇవన్నీ కూడా లోక్‌సత్తా ఈ దేశంలో ఉన్నటువంటి రాజకీయపక్షాలు, ప్రజాఉద్యమాలు కలసి సాధించినటువంటి ఘన విజయాలు. మరి కొన్ని మార్పులు త్వరలో రానున్నాయి.. ఉదా॥ సహకార సంఘాలకు స్వయం ప్రతిపత్తిని కల్పించడం. కోసం రాజ్యాంగ సవరణకి కొన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ విధంగానే స్థానిక

న్యాయాలయాల చట్టం ఒకటి ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో వుంది. ఇలా మరికొన్ని వస్తున్నాయి. కాని మౌలికమైనటువంటి మార్పులు అంటే మనదేశ రాజకీయాన్ని, ప్రజాస్వామ్యాన్ని మార్చేటువంటి మార్పులు, ఆ విషయంలో రాజకీయ పార్టీలకు స్పష్టతలేదు. ఒకవేళ స్పష్టత ఉన్నా చెయ్యాలన్న, ఆసక్తి వున్నా, చేసే శక్తిలేదు.

ఈ దేశంలో ముఖ్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు ఒక విచిత్రమైనటువంటి విషవలయంలో కూరుకుపోయాయి. దాన్నుంచి బయటకు వచ్చి రాజకీయం తీరుని, ఆట నియమాల్ని మార్చేటువంటి శక్తిని రాజకీయ పార్టీలు ప్రదర్శించలేకపోతున్నాయి. ఈ పార్టీల నాయకత్వాలు చాలా మేరకు మార్పు కావాలని కోరుకుంటున్నాయని అని నేను నమ్ముతున్నాను. కానీ మార్పు తెచ్చేటటువంటి శక్తి, వారికి ఎందుకు లేదంటే, ప్రస్తుతం వున్నటువంటి ఎన్నికల తీరుమీద, ఈ అధికార క్రీడల మీద వారు పూర్తిగా ఆధారపడివున్నారు. దానిలో కూరుకుపోయివున్నారు. దాన్నుంచి బయటపడి కొత్త నాయకత్వాన్ని, ఇచ్చి, కొత్త ఆటనియమాలను సృష్టించడమనేది వారికి అసాధ్యమైన పనిలా కన్పిస్తున్నది.

రెండవది: రాజకీయ సంస్కృతి. లోక్‌సత్తా ఉద్యమం ప్రారంభమయిన తరువాత గత 9, 10 ఏళ్ళుగా చూసినట్టయితే, ఆనాడు అసెంబ్లీకి పోటీచేసే ఒక అభ్యర్థి లక్షన్నర రూపాయలు చట్టబద్దంగా ఖర్చుపెట్టవచ్చు. కానీ ఆనాడు లక్షన్నరకు బదులు 10,15 లక్షలు ఖర్చుపెడుతుండేవారు. "ఏమిటిదీ, చట్టం లక్షన్నరంటే ఇక్కడ 15 లక్షలు ఖర్చుపెడుతున్నారు" అని మనం వాపోయేవాళ్ళం. ఒక అభ్యర్థి ప్రస్తుతం 10 లక్షలు ఖర్చు పెట్టే అవకాశం చట్టబద్దంగా వుంది. కానీ ఈవేళ ఒక అభ్యర్థి కోటి, కోటిన్నర రూపాయలు ఖర్చుపెడితే అదిపెద్ద లెక్కలోకి రాదని చెప్తున్నారు. కేవలం 2, 3 వేల ఓట్లు వున్నటువంటి యం.పి.టి.సి. నియోజక వర్గానికి ఈవేళ 10, 15 లక్షలు ఖర్చుపెట్టిన సందర్భాలు చాలా వున్నాయి. ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికలలో, అలాగే మండల పరిషత్, జిల్లాపరిషత్ సభ్యత్వానికి 40 లక్షలు ఖర్చుపెట్టడం అసాధారణం కాకుండా సర్వసాధారణం అయింది. ఈ లెక్కన చూస్తే వచ్చే శాసన సభ ఎన్నికల నాటికి ఒక అసెంబ్లీ సీటుకు రెండు, మూడు కోట్ల రూపాయలు కూడా చాలకపోవచ్చు. ఈ డబ్బుతో ఓట్లుకొనడం, డబ్బుతో కొన్నారు కాబట్టి రాజకీయం మొత్తాన్ని కలుషితం చేయడం, బదిలీలు, కాంట్రాక్టులు, పోలీసు కేసుల్లో జోక్యం... ఇలా ఎక్కడపడితే అక్కడ డబ్బు సంపాదించడం, పెట్టిన పెట్టుబడికి పదిరెట్లు తిరిగి ఆర్జించడం ఇవన్నీ మామూలైపోయాయి. ఈ రాజకీయ సంస్కృతి నుండి

బయటపడటం రాజకీయ పక్షాలకు అసాధ్యంగా కన్పిస్తున్నది. లోక్‌సత్తా చాలా ఆశావాదంతో వున్న ఉద్యమం. వ్యక్తిగతంగా నేను చాలా ఆశావాదిని. ఈదేశంలో ప్రజాస్వామ్యం బాగుపడుతుందని, మనందరికీ పూర్తి విశ్వాసం ఉన్నది. అయితే ఆశావాదంతో పాటు ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితుల్లో ఉన్న కొన్ని ప్రమాదాలను కూడా పరిగణించాలి.

మన ఆర్థిక వ్యవస్థ, సమాజం రెండూ కూడా వేగంగా ముందుకు పరుగెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. పాలనలో ఎన్ని లోపాలున్నాకూడా, సమాజంలో వున్న బలం వల్ల ప్రతి సంవత్సరం ఆర్థికాభివృద్ధి 8, 9 శాతం పెరగడం చూస్తున్నాం. ఇంతకంటే ఎక్కువ సాధించే అవకాశం వుంది. అయితే మన రాజకీయం సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థను వెనక్కు లాగుతున్నది. ఇది ఎడ్లబండి వెళుతున్నప్పుడు వెలపటెద్దు, దాపటెద్దు లాంటిది. ఒక ఎద్దు ముందుగా వుండి మరోఎద్దు వెనక్కు లాగుతుంటే , అయితే వెనక్కు లాగుతున్న ఎద్దు త్వరగా, వేగంగా నడవాలి. లేదంటే ముందుకు పరిగెడుతున్న ఎద్దు కొంచెం ఆగి రెండో ఎద్దుతోపాటు సమానంగా వెనక్కి నడిచి నెమ్మదైపోవాలి. లేదంటే రెండూకూడా అసమానంగా పరుగెడుతున్నట్లయితే ఆ బండి ఇరుసు విరిగిపోతుంది. బండి చతికిల పడుతుంది. మనదేశ పరిస్థితి కూడా ఇలాగే వుంది. ఈవేళ రాజకీయం, రాజకీయం తీరు మన ఆర్థిక వ్యవస్థకి, సామాజిక అభివృద్ధికి అవరోధంగా తయారయ్యాయి. దీన్ని గనక మనం త్వరగా మార్చకపోయినట్లయితే ఆర్థికాభివృద్ధి మరింత కుంటుపడుతుంది. ఇప్పుడు దేశంలో ఉన్న సంక్షోభం మరింత పెరుగుతుంది.

ఉదాహరణకి చట్టబద్ధపాలన లేకుండా వున్నట్లయితే ఆర్థికంగా ముందుకు వెళ్లడం సాధ్యంకాదు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ ను చూడండి. అసలు మీరు నిజాయితీగా, నల్లధనం లేకుండా ఆస్తులు కొనడం అసాధ్యం. ఒక సామాన్యపౌరుడు, ఒక మధ్యతరగతి పౌరుడు 20, 25 వేల రూపాయల జీతం వున్నవాడైనా ఈవేళ పట్టణంలో నివాసం కోసం అనిచెప్పి ఒక ఫ్లాటు కొనుక్కోవటమో, ఒక స్థలం కొనుక్కోవటమో జీవిత కాలం కూడబెట్టిన మొత్తం డబ్బు ఖర్చుపెట్టినా కూడా అసాధ్యమైన పరిస్థితి వచ్చింది. అంటే ఈదేశంలో ఏం సంకేతాన్నిస్తున్నాం మనం. మన రాజకీయం దీన్నించి బయటపడాలని ప్రయత్నం చేయడం లేదు. దీన్నించి బయట పడాలి అంటే మన నేర న్యాయ వ్యవస్థని మార్చాలి. నల్లధనం అవసరం లేని వ్యవస్థని సృష్టించాలి. అందరికి గృహవసతి కల్పించేటటువంటి విధానాలు ఉండాలి.

అలాగే ఇంకో విషయం తీసుకోండి. ఈవేళ అవినీతి లేకుండా వ్యాపారం చేయడం అసాధ్యమైపోతున్నది. ప్రభుత్వ ప్రమేయం ఏమాత్రం లేని కొన్ని రంగాలలో తప్ప. పరిశ్రమకి భూమి కేటాయించడం దగ్గర్నించి, రోజువారి పన్నులు కట్టడందాకా ఎక్సైజ్ పన్నులు, కమర్షియల్ టాక్స్ కట్టడం దాకా అవినీతి లేకుండా వ్యాపారం చేయడం అసాధ్యమవుతుంది. అంటే అవినీతి లేని ఆర్థిక వ్యవస్థ అసాధ్యమవుతుంది. నీతివంతంగా నడిస్తే తప్ప ఆర్థిక ప్రగతి పెరగదు. కానీ నీతివంతంగా నడిచినవాడు వెనకబడిపోతున్నాడు. కాబట్టి పోటీ తట్టుకోవాలి అంటే అవినీతికి పాల్పడుతున్నాడు, లేకపోతే ఇటు వ్యాపారం నుంచి నిష్క్రమిస్తున్నాడు. అవినీతి లేకుండా వున్నట్టయితే ఆర్థిక వ్యవస్థ కనీసం 2, 3 శాతం అదనంగా పెరుగుతుంది. కొన్ని పరిశోధనలు ఈ విషయాన్ని రుజువుచేశాయి. ప్రపంచదేశాల్లో అవినీతి, అక్కడి ఆర్థిక ఎదుగుదల ఈరెండింటిని పోల్చి మన రాష్ట్రానికిచెందిన భానోజీరావు గారు మరికొందరు, చేసిన పరిశోధన ఏమిటంటే భారతదేశంలో గనక ఈ రాజకీయ అవినీతిని అరికట్టగలిగినట్టయితే ప్రభుత్వ వ్యవస్థలో కనీసం ఒకటిన్నర రెండు శాతం ఆర్థిక అభివృద్ధి పెరుగుతుందని అన్నారు. ప్రస్తుతం వున్న అభివృద్ధికి, 2 శాతం పెరగడానికి మధ్య తేడా చాలాఎక్కువ వున్నది. ఎందుకంటే కాంపౌండు రేటున చక్రవడ్డీ ఇది గనక రెండు శాతం పెరిగినట్టయితే చాలా వేగంగా దేశంలో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుంది. అవినీతి ఇలాగే వుంటే ఆర్థికాభివృద్ధి పెరిగేది పోయి తగ్గే ప్రమాదముంది. మనం ఇరిగేషన్ కాంట్రాక్టుల్లో అవినీతి గురించి వింటున్నాం. రోజువారీ పనితీరులో, మనకు ప్రభుత్వాలతో ఏమాత్రం లావాదేవీలు వున్నా జరుగుతున్న అవినీతిని మనం చూస్తున్నాం. అలాగే దేశ వ్యాప్తంగాఎక్సైజ్ గాని, వాణిజ్య పన్నులు గాని, కస్టమ్స్ గాని, వీటిల్లో అవినీతి వల్ల అభివృద్ధి ఎంత కుంటుపడుతుందో మన చూస్తున్నాం. ఇలా ఎన్నో రంగాల్లో ఉపాధి కల్పనకి, సంపద సృష్టికి, ఆర్థికాభివృద్ధికి రాజకీయ కారణాల వల్ల వస్తున్నటువంటి అవినీతి పెద్ద అవరోధం కల్పిస్తున్నది.

దీనివల్ల ఏమౌతుంది. రానురానూ ఆశలకు తగ్గట్టుగా జీవితం ఉండటంలేదు. కొంత మందికి అవకాశాలు దొరుకుతున్నాయి. కానీ అంతకు కొన్నిరెట్లు మంది ప్రజలకు అవకాశం దొరకడం లేదు. వాళ్ళ గుండెల్లో కసి పెరుగుతున్నది. గ్రామ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లోని మురికి వాడల్లో విషాదం తాండవిస్తున్నది. ఇప్పుడు కోట్లాది కుటుంబాలలో మంచి ప్రమాణాలు గల విద్య అందకపోవటం చేత, పేదరికం

వల్ల, కేవలం పుట్టిన కులం, కుటుంబం కారణంగా ఆ బిడ్డలకు ఎదిగే అవకాశాలు ఉండటం లేదు.  ఒక పక్కన టి.వి.ల్లోనూ, ప్రపంచంలో మిగతావాళ్ళ అనుభవాలు చూస్తున్నప్పుడు మనకవన్నీ అందుకోవాలని ఆత్రుత వుంటుంది.  పూర్వం పాతికేళ్ళ క్రితం టి.వి.లు లేవు, ప్రపంచంలో ఏం జరుగుతుందో, ఏ అవకాశం వున్నదో ఎవరికీ తెలిసేదే కాదు, ఈవేళ అన్నీ తెలిసిపోతున్నాయి. ఈ రోజు టి.వి ల్లో ఆకర్షణీయమైన ప్రకటనలు వస్తున్నాయి. మనం కూడా ఆర్థికంగా పెరగాలి,  కుటుంబం బాగా సంతోషంగా వుండాలి, సంపద పెరగాలి అన్న కోరిక సహజంగా వుంటుంది.  కానీ అవకాశాలు కోట్లాదిమందికి కరువవుతున్నాయి. ఈ దేశంలో లక్షలమంది బాగా ఆర్థికంగా ఎదుగుతుంటే లక్షాధికారులు అంతకుమించి పెరుగుతుంటే వాళ్ళ కుటుంబాలు, వాళ్ళ పిల్లలు బాగుపడే అవకాశం కలుగుతుంటే, కోట్లమందికి అవకాశాలు పూర్తిగా మృగ్యం అవుతున్నాయి. దీనివల్ల ఖచ్చితంగా గుండెల్లో కసి, ద్వేషం, హింస పుట్టి తీరతాయి. మనమేదో తుపాకులతో దీన్ని అణచివేస్తామని చెప్పటం పొరపాటు. రాజకీయం దీనిని పట్టించుకోవాలి.  మధ్యతరగతి వర్గాలనుంచి, సంపన్న వర్గాల నించి ఏదోరకంగా నాకు సమాజంలో శాంతికావాలి, హింసను అణచివేయాలి, భద్రత కావాలి,  మాపిల్లలు చదువుకోవాలి, మాకు ఆర్థికాభివృద్ధి కావాలి, మాకు ఉద్యోగాలు కావాలి, మాకు పరిశ్రమలు కావాలి. అన్న డిమాండ్ పెరుగుతుంది. ఇవన్నీకూడా సహజమైన కోర్కెలు.  దీనిలో అసహజమైనవి,  నేరసమానమైనవి ఏవీ లేవు.  అన్నీకూడా సహజమైన  మంచికోర్కెలే.  కాని ఈవేళ ఈ నేరన్యాయ వ్యవస్థ  సరిగాలేదు కాబట్టి, సమాజంలో  హింస చెలరేగుతోంది కాబట్టి ఏదోరూపంలో మాకు శాంతి భద్రతలను కాపాడండి, కావాలంటే చట్టాల్ని పక్కన పెట్టండి, కఠినంగా వ్యవహరించండి అంటున్నారు. సమాజంలో, రాజ్య వ్యవస్థలో ఇలాంటి పోకడలు  పెరుగుతున్నాయి.

మూడోది నగరీకరణ పెరగటంతో, బీదరికం అదే సమయంలో పెరగటంతో, రాజకీయం, నేరప్రవృత్తి రెండు కలగలిసి పోవడంతో, పోలీసులు పూర్తిగా రాజకీయ జోక్యంతో పనిచేయడంతో, నేరపరిశోధనలో అటు అక్రమాలు, ఇటు ఆశ్రిత పక్షపాతం ఇవన్నీ చోటు చేసుకోవటంతో నగర ప్రాంతాల్లో ఉన్న కొద్ది సంఘటిత నేరాలు పెరిగేటటువంటి ప్రమాదం కనిపిస్తున్నది.  ఈవేళ మన సమాజంలో అంతర్గతంగా వున్న కుటుంబ వ్యవస్థ బలంగా వుండటం వల్ల కనీసం పెద్దగా నేరాలు  జరగటంలేదు, కొంత అదుపులో వున్నాయి.  కానీ ఎల్లకాలం ఇట్లా వుండదు. ఇప్పటికే ఈ దేశంలో కొన్ని ప్రాంతాల్లో, కొన్ని నగరాల్లో ప్రమాద సూచికలు  కనిపిస్తున్నాయి.  పిల్లల్ని

అపహరించుకుపోవడం, డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించడం, కొన్ని సందర్భాల్లో చంపేయడం, కొన్ని సందర్భాలలో చాలా దారుణంగా హింసకి పాల్పడటం ఇవన్నీ కూడా చూస్తున్నాం. మెక్సికో లాంటి నగరాల్లో, కొన్ని దేశాల్లో ఈ పోకడలు చాలా స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఒక పక్క అవకాశం దొరక్కపోవటం చేత ఆ కసిలోంచి పుట్టే హింస; మరోపక్క ఎట్లాగోఅట్లా శాంతి భద్రతలను కాపాడాలనే వైఖరి; మూడోపక్క సంఘటిత నేరాలు పెరిగిపోవటం సమాజంలో అభద్రతాభావం పెరిగిపోవటం; ఈ మూడూ కూడా సమాజాన్ని ఇప్పటికే అల్లకల్లోలం చేయడం మొదలు పెడుతున్నాయి. వచ్చే పది సంవత్సరాల్లో ఈ ప్రమాదాలు మరింత తీవ్రంగా పెరుగుతాయి. వాటినుంచి బయట పడటంకోసం రాజకీయం ఏరకమైనటువంటి ఆలోచన చెయ్యడంలేదు. ఎన్ని మార్పులు సమాజంలో చోటుచేసుకుంటున్నా కూడా దానికి సంబంధం లేకుండా గతంలో ఏ రకంగా చేస్తున్నామో దాన్నే మరింత కొనసాగించటం, అప్పుడు నేరస్తులు ఎక్కువగా ఉంటే ఇప్పుడు ఇంకా నేరస్థుల్ని పెట్టడం, అప్పుడు డబ్బు ఖర్చుపెడితే ఇప్పుడు పదిరెట్లు డబ్బు ఖర్చుపెట్టడం, అప్పుడు లంచాలు తీసుకుంటే, ఇప్పుడు పదిరెట్లు లంచాలు తీసుకోవడం ఈరకంగా కొనసాగుతుంది తప్ప ఏరకంగా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి సమాజంలో విశ్వాసాన్ని కల్పించాలి, ఈ ప్రవృత్తుల్ని మార్చాలి, ఆర్థికంగా పెరిగే అవకాశాన్ని కల్పించాలి, పేదరికం నుంచి బయటకు లాగాలి అనే ఆలోచన జరగటంలేదు.

ఈ నేపథ్యంలో కొత్త రాజకీయం అంటే కేవలం ఒక కొత్త రాజకీయ పార్టీని పెట్టడం మాత్రం కారాదు. కేవలం మరికొందరు రాజకీయంలో పాలుపంచుకోవడం కాదు. రాజకీయానికి కొత్త అర్థాన్నిచ్చి, సంస్కృతిని మార్చి ఓ గాంధీ, ఓ అంబేద్కర్ చేపట్టిన రాజకీయాన్ని మళ్ళీ తీసుకురావాలి . ప్రజలు దానికి అనువుగా స్పందిస్తున్నారు. మంచేమిటో ప్రజలకు తెలుసు. మంచి తెలిసాక వాళ్ళు ఏ ప్రలోభాలకి లొంగకుండా కొత్త రాజకీయాన్ని మనసారా ఆహ్వానిస్తారు అన్న విషయం రుజువు చేసినప్పుడు మాత్రమే ఈ దేశంలోనూ, అటు వ్యవస్థలోనూ మార్పులు వస్తాయి, ఇటు వెంటనే వచ్చే సంక్షోభాన్ని తట్టుకోగలుగుతాం. అందుకోసం కేవలం కొత్తపార్టీ అనే కాకుండా, కొత్తమనుషులు, కొత్తముఖాలు రావడం మాత్రమే కాకుండా కొత్తసంస్కృతిని సృష్టించడం కోసమని కొత్త రాజకీయాన్ని తీసుకురావలసిన అవసరం వున్నది. ఈ నేపథ్యంలో లోక్‌సత్తా అందుకోసం అడుగేయవలసి వచ్చింది.

**2. డబ్బు, సారా, లేకుండా ఎన్నికల్లో గెలవడం సాధ్యంకాని ప్రస్తుత పరిస్థితుల్లో మీ పార్టీ నిధుల్ని ఎలా సమకూర్చుకుంటుంది? ఎలా విజయం సాధిస్తుంది?**

నిజమే, ఈ దేశంలో చాలామంది అభిప్రాయం ఏమిటంటే, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రంలో రెండు కోట్ల రూపాయలు లేకపోతే అసెంబ్లీలో పోటీ సాధ్యంకాదు అనే పరిస్థితి వస్తున్నప్పుడు, పాతిక ముప్పై లక్షలు లేకపోయినట్లైతే జిల్లా పరిషత్ ఎన్నికల్లోకూడా సాధ్యం కాదన్నప్పుడు, ఐదు పది లక్షలు లేకపోతే మండల సభ్యత్వం సాధ్యం కాదన్నప్పుడు మరి డబ్బుమీద ఆధారపడకుండా ఎలా అన్నది చాలా కీలకం అనిపిస్తుంది. దీనిలో రెండు విషయాలున్నాయి. మొట్టమొదటిది రాజకీయ కార్యకలాపాలు చేయడం కోసం, దాన్ని జనకీయంగా మార్చడం కోసం, ప్రజలకు సందేశం అందడంకోసం, ప్రజల భాగస్వామ్యం కోసం, కొన్ని చట్టబద్ధమైన కార్యక్రమాలు చేపట్టడం కోసం పార్టీలకు డబ్బు అవసరం. ఇందుకు అవసరమైన డబ్బు లేకుండా రాజకీయం చేయడం సాధ్యంకాదు. కాబట్టి ఆ డబ్బుకి చట్టబద్దమైన మార్గాన్ని ఎన్నుకోవడం ఒకటి. రెండోది చట్టవిరుద్దమైన కార్యక్రమాలు అంటే ఓట్ల కొనుగోలు, మద్యం పంపిణీ ఇతర అక్రమాలు వగైరా లేకుండా ఎన్నికల్లో గెలుపు సాధ్యం కాదు అన్న భావం ప్రచారంలో వుంది. ఇది కొంతవరకు వాస్తవం కూడా. దీన్నుంచి ఎలా బయటపడాలి? ఈ రెండింటిని మనం వేర్వేరుగా చూడాలి. లేకపోతే గందరగోళం వస్తుంది. మొట్టమొదటి విషయం ముందు చెపుతాను.

లోక్‌సత్తా చేసిన కృషి పుణ్యమాని ఈవేళ ఎన్నికల నిధుల చట్టంలో మౌలికమైన మార్పులు వచ్చాయి. 10, 15 ఏళ్ళ క్రితం రాజకీయంలో పాలు పంచుకోవాలి అని అంటే వ్యక్తిగతంగా మీకు ఆసక్తి ఉన్నా కూడా, చిత్తశుద్ధి వున్నా కూడా, పార్టీకి గానీ, వ్యక్తికిగాని నల్లధనం లేకుండా, దొంగడబ్బు లేకుండా, రాజకీయంలో పాలుపంచుకోవడం అసాధ్యమైన పరిస్థితులు వున్నాయి. ఈవేళ ఆ పరిస్థితి లేదు. ఈవేళ వ్యక్తులు గాని సంస్థలు గాని, రాజకీయపార్టీల కోసం విరాళాలు ఇచ్చినట్లైతే, దాతలకి నూటికి నూరుపాళ్ళు ఆదాయపు పన్ను మినహాయింపు వుంది. ఈవేళ నిజాయితీగా రాజకీయంలో వనరులు స్వీకరించటం కోసం ప్రత్యామ్నాయ మార్గాలను దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేశాం. దాన్ని మనం ఉపయోగించుకోవాలి. నిజాయితీగా రాజకీయం చేయాలి. నిజాయితీగా గనక మీరు రాజకీయం చేసినట్లైయితే

పెరుగుతున్న జనమాధ్యమాలని సద్వినియోగం చేసినట్లయితే, ప్రజలకి వారి బాగోగుల్ని వారి జీవితంలోంచి అర్థం అయ్యేటట్టుగా చెప్పగలిగినట్లయితే, ఈవేళ చట్టం నిర్దేశించిన మేరకు అంటే (ఉదాహరణకు అసెంబ్లీ ఎన్నికలకు 10 లక్షల రూపాయలు, లోక్‌సభకు పాతిక లక్షల రూపాయల) ఈ మాత్రం ప్రజల దగ్గర చందాల రూపంలో సేకరించడం సాధ్యం. కాబట్టి అది సమస్యకాదు.

రెండవది కీలకమైన సమస్య. అయితే ఈవేళ పార్టీలు ఇన్ని కోట్లు ఖర్చుపెడుతున్నాయి కదా! డబ్బులు తీసుకుని ప్రలోభాలకు లొంగిపోయి ఓట్లు వేస్తున్నారు కదా, దాన్నించి బయట పడటం ఎట్లా! ఆ పనే మనం చేసినట్టయితే మనం కూడా సమస్యలో భాగం అవుతాం. అప్పుడు దానికోసం పార్టీ అక్కరలేదు, కొత్త రాజకీయ సంస్కృతి అనే మాట అర్థం ఉండదు. ఆపని చేయకుండా వుంటే మరి ప్రజల విశ్వాసాన్ని చూరగొనటం ఎలా? మరి దాన్ని రాజకీయ శక్తిగా మార్చడం ఎలా? ఇది చాలా కీలకమైన విషయం. ఇది కేవలం లోక్‌సత్తా విషయం కాదు, ఒకరిద్దరి వ్యక్తుల విషయం కాదు. దేశం ముందున్న పెద్ద సవాల్. తొలి స్వతంత్ర పోరాటంలో 40 ఏళ్ళు దాకా ఎంతటి పెద్దపోరాటాన్ని చేశారో, జనసామాన్యానికి విషయం అర్థం అయేటట్లుగా చేయడం కోసం అని చెప్పి ఆనాటి పెద్దలు ఎంతటి బృహత్తరమైనటువంటి పవిత్ర ఉద్యమాన్ని నిర్మించారో ఈనాడు మనం అంతటి ఉద్యమాన్ని నిర్మించాలి. ప్రజలకు వారి మంచేమిటో వారికి అర్థమయినట్లయితే, మనం వేసేటటువంటి ఓటుకి, ఆ ఓటువల్ల జరిగే పర్యవసానానికి మధ్య సంబంధం బోధపడినట్లయితే, నేను వేసిన ఓటువల్లే నాకు పోలీస్ స్టేషన్‌లో అన్యాయం జరగకుండా న్యాయం జరగటం కాని, కోర్టుల్లో మనకు సకాలంలో న్యాయం అందటం కాని, మనకి పాఠశాలల్లో మన పిల్లలకు మంచి ప్రమాణాల విద్య పైసా ఖర్చు కాకుండా ఉండటం కాని, ఆసుపత్రిలో జేబుల్లోంచి ఖర్చుకాకుండా, ఒళ్ళు హూనం కాకుండా, కుటుంబం నాశనం కాకుండా, మన బిడ్డల భవిష్యత్తుని వాళ్ళ ఆరోగ్యాన్ని తీర్చి దిద్దేట్లుగా మంచి ప్రమాణాల ఆరోగ్యం ఉచితంగా అందుతుంది అన్న విశ్వాసం కలగటం కాని, ఇలా ఎన్నో రంగాల్లో మనకి న్యాయం జరగడానికి మనం వేసే ఓటుకి మధ్య సంబంధం వుందని చెప్పటం కాదు, ఎలా వున్నదో స్పష్టంగా వివరించి చెప్పగలిగేటటువంటి ప్రయత్నం మనం చేసి నట్లయితే ప్రజలు మనల్ని అర్థం చేసుకుంటారు. ఇలాంటి మార్పుకు స్పందిస్తారని నాకు పూర్తి విశ్వాసం. మనదేశంలోనే చూసినట్టయితే ఎన్నో సందర్భాల్లో ఇన్ని కోట్లు ఖర్చవుతున్నా కూడా ఎక్కువ ఖర్చు పెట్టిన వారే గెలవడం

లేదు. ఎన్నో సందర్భాల్లో తక్కువ ఖర్చు పెట్టిన పార్టీలను ప్రజలు గెలిపిస్తున్నారు. మొత్తంమీద చూచినట్లయితే ఖర్చుతో నిమిత్తం లేకుండా ఆ పార్టీమీదా, లేదా ఆ అభ్యర్థి మీద వున్న విశ్వాసాన్ని బట్టి, నమ్మకాన్ని బట్టి, లేకపోతే కోపాన్ని బట్టి ఓట్లు పడుతున్నాయి, ఫలితాలు వస్తున్నాయి. అందుకనే ఎన్నికల్లో ఫలితాలు వచ్చేదాకా ఏపార్టీ ఓడుతుందో, ఏపార్టీ గెలుస్తుందో ఎవరు చెప్పలేకుండా ఉన్నారు. డబ్బు ప్రభావం వున్నమాట వాస్తమే అయినప్పటికీ కూడా పూర్తిగా డబ్బుకే లొంగుతున్నారు అన్నమాట పొరపాటు. ఎన్నోసార్లు డబ్బు అవసరం లేకుండా ఓట్లు వేశారు. ఒక ప్రత్యామ్నాయ రాజకీయాన్ని మేం చూపెడతాం , ప్రత్యామ్నాయ విధానాన్ని మేం తీసుకొస్తాం అని విశ్వాసం గల నాయకులు చెప్పినప్పుడు ప్రజలు పూర్తిగా మద్దతు ఇచ్చారు. ఒక ఇందిరాగాంధీ, ఒక ఎన్.టి.రామారావు, ఎన్నో సందర్భాల్లో రుజువు చేశారు. అయితే వారు ప్రత్యామ్నాయ రాజకీయాన్ని సృష్టించలేక పోవటంతో ఆనమ్మకం వమ్ము అయింది. కాబట్టి మళ్ళీ ఆపార్టీలే ముందుకు వచ్చినా కూడా డబ్బు అవసరం అవుతున్నది. ఈవేళ మనం చేయవలసింది కేవలం ప్రత్యామ్నాయంగా మాటలు చెప్పటం, నినాదాలు ఇవ్వడం కాకుండా, ఈ ఓటువల్ల వారి జీవితం ఏవిధంగా బాగుంటుందో అర్థం అయ్యేట్టు చెప్పటం, చాలా సవివరంగా నిర్ధిష్టమైన విధానాలను రూపొందించి, రాజకీయాలను జనజీవనం చుట్టూ తిప్పటం లాంటి పనిచేసినట్లయితే ఖచ్చితంగా జనం ఆదరిస్తారు. దాంతోపాటు ఈవేళ చదువుకున్నవారు, దేశంలో మంచి జరగాలని కోరుకుంటున్నవారు 20, 25 శాతం మంది కనీసం పూర్తిగా రాజకీయాలకు దూరం అయిపోయారు. ఈరాజకీయం కుళ్ళిపోయింది, మనజీవితాలు మనం చూసుకుందాం అని చెప్పి తిట్టుకుంటూ కూర్చుంటున్నారు. వారికి విశ్వాసాన్ని కలిగించాలి. రాజకీయాల్లో ఉన్నటువంటి లోపాలకు ప్రత్యామ్నాయం మరింత మంచి రాజకీయం మాత్రమే. అంతేగాని రాజకీయాన్ని తిడుతూ కూర్చుంటే దేశం మారదు. వ్యక్తిగతంగా లేదా కొన్ని సంస్థల ద్వారా మనం ఎన్ని పనులు చేసినా కూడా రాజకీయం చేసేపనుల ముందు మనం బలాదూర్. మంచి చేయాలన్నా, చెడు చేయాలన్నా రాజకీయాలకున్నంత బలం బయట వాళ్ళకి లేదు. కాబట్టి కొత్త రాజకీయాన్ని సృష్టిద్దాం. దానిలో మనం భాగస్వాములవుదాం. పరిష్కారంలో మనం పాలు పంచుకుందాం. అంతేగానీ దూరంగా అయిపోవద్దు, సమస్యలో భాగం కావద్దు, చెడు చేస్తున్నవాడికన్నా కూడా, చెడును చూస్తూ మౌనంగా కూర్చున్నవాడు పాపం చేస్తున్నట్లు లెక్క. కాబట్టి మనమంతా ముందుకు రావాలి. ఈ రకంగా ముందుకు రాబట్టే స్వతంత్ర పోరాటంలో

విజయం సాధించాం. ఈవేళ మనం చేస్తున్నటువంటిది 'రెండవ స్వతంత్ర్యపోరాటం', అనే విశ్వాసాన్ని, ఆ భావాన్ని రేకెత్తించాలి. అప్పుడు ఖచ్చితంగా 20, 25 శాతం మంది ముందుకు వస్తారు. ఏ జనహితం కోసం మనం పోరాడుతున్నామో ఆ ప్రజలకి ఓటుకి, జనహితానికి మధ్య సంబంధం అర్థమైనప్పుడు, ప్రస్తుత రాజకీయం నుంచి దూరంగా ఉండిపోయి ముభావంగా వున్నటువంటి వర్గాలు, అర్థం చేసుకున్నటువంటి వర్గాలు ఒక త్రాటిపైకి వచ్చినపుడు ఖచ్చితంగా ఈదేశంలో, ఈరాష్ట్రంలో రాజకీయంగా పెద్ద విప్లవం వస్తుంది. దానికోసం మనం పోరాడాలి. అప్పుడు డబ్బు అనేది అవరోధంకానే కాదు. అంచేత కొత్త తీరులో, కొత్త రక్తంతో, కొత్త సంస్కృతి కోసం కొత్త రాజకీయాన్ని చేసినట్టయితే ఖచ్చితంగా అటు జనసామాన్యము, ఇటు ఆలోచనాపరులు స్పందిస్తారు, దేశాన్ని మార్చుకుంటారు.

## 3. రాజకీయాలు నేరమయమైపోయాయి ఎన్నికల్లో హింసా, దౌర్జన్యం, రిగ్గింగ్, బూత్‌ల ఆక్రమణలు సర్వసాధారణం అయిపోయాయి. వీటిని తట్టుకుని మీ పార్టీ ఎలా మనుగడ సాగించగలదు?

దీనిలో రెండు అంశాలున్నాయి. ఒకటి నేరస్తులు బెదిరించటం, భయపెట్టడం, రెండు: అక్రమాలకు పాల్పడి ఫలితాలు తారుమారు చేయడం. ముందు రెండవ అంశంలోకి వస్తాను. ఒకప్పుడు నిజంగా పోలింగ్ స్టేషన్‌లలో బూత్‌ల ఆక్రమణలు జరిగేవి. అయితే రాను రానూ ప్రజల్లో కొంత అవగాహన పెరగడం, పత్రికలు, జనమాధ్యమాలు గట్టిగా పట్టించుకోవటం, ఎన్నికల సంఘం కఠినమైన చర్యలు చేపట్టటం, ఇవి ప్రవేశపెట్టడం వల్ల కొంత తగ్గిపోయింది. అన్నిటినీ మించి బహుశా మనకి ఓటు వేయడానికి ఏదోరకమైనటువంటి గుర్తింపు కార్డు లేకపోతే చాలా వరకు ఓటింగ్ సాధ్యం కాకపోవడం, వీటివల్ల చాలా మేరకు దొంగ ఓట్లు, రిగ్గింగు, మామూలు రిగ్గింగు అంటే ఒకరి ఓటు ఇంకొకళ్ళు వేయటం, ఇతర పోలింగ్‌లో జరిగే మామూలు అక్రమాలు చాలా వరకు తగ్గాయి. లోక్‌సత్తా చేస్తున్న పరిశోధనలు కూడా ఈ అక్రమాలు తగ్గినట్టుగా చాల సోదాహరణంగా, సాధికారికంగా రుజువుచేస్తున్నాయి. దీన్ని మరింత ముందుకు తీసుకు వెళ్ళాలి. ఓటర్ల జాబితా పూర్తి ప్రక్షాళన జరగాలి. దానికోసం లోక్‌సత్తా చాలాకాలం నుంచి పరిష్కారాలు చూపెడుతున్నది. ఉదాహరణకి జన సామాన్యానికి అందుబాటులో ఏ గ్రామానికి ఆ గ్రామానికి లేదా రెండు మూడు గ్రామాలు కలిపి పోస్టాఫీసుల్లో ఓటర్ల జాబితాలు వుంచి అక్కడే ఓటర్ల జాబితాలో

సవరణకి అవకాశం కల్పించాలి. పొరపాట్లు జరిగితే పైకి అప్పీలు చేసే అవకాశాన్ని ఏర్పాట్లు చేసినట్లయితే ఇది పరిష్కారమౌతుంది. ఇందకు ప్రపంచంలో ఉదాహరణలు ఉన్నాయని లోక్‌సత్తా చెపుతున్నది. దాని అమలు ఇంకా పూర్తి కాలేదు. తొలిదశలో వుంది. దాని అమలు మనం వేగిరంగా చేయించాలి. దానికి చట్టం మార్చక్కర్లేదు. నియమాలు కూడా మార్చక్కర్లేదు. కేవలం ఎన్నికల సంఘం కొన్ని ఆదేశాలు, పోస్టల్‌శాఖ ముందుకొచ్చి వారితో కలిసి రావడం, ఈ రెండు జరిగినట్లయితే ఇవి సాధ్యం.

ఇక రెండవది భయభ్రాంతులను చేయటం. పోలింగ్‌తో నిమిత్తం లేకుండా బయటే వాళ్ళందర్నీ హింసాకాండకు, లేకపోతే కులమో, రక్తపాతమో, కండబలమో ఉపయోగించి భయపెట్టడం. ఇది కొన్ని ప్రాంతాల్లో ఈ దేశంలో వున్నమాట వాస్తవమే. కానీ లోతుగా పరిశీలించినట్లయితే గతంతో పోల్చినట్టయితే భయానికి ఓట్లు వేయటం తగ్గుతున్నది. ఎందుకంటే ఎప్పుడైతే రాజకీయం మొత్తం బహిరంగమౌతుందో, జన మాధ్యమాల పాత్ర, టి.వి. ఛానళ్ళ పాత్ర పెరుగుతుందో ప్రజల్లో రాజకీయం పట్ల అవగాహన కాస్తా, కూస్తో పెరుగుతున్నదో, సంఘటితంగా ఈరకమైన దౌర్జన్యాలు ఎదిరించే పరిస్థితి ప్రజల్లో పెరుగుతున్నది. అయినాకూడా కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి వున్నట్లయితే దాన్ని శాంతియుతంగా, సంఘటితంగా కాస్తంత విజ్ఞతతో వ్యతిరేకించేటటువంటి శక్తిని ప్రజలకి మనం అందించాలి. అండదండలు ఇవ్వాలి. పోలింగ్‌లో బల ప్రయోగం వల్ల పెద్దఎత్తున ఫలితాల్లో మార్పు వుంటుంది అని నేను అనుకోవడంలేదు.

## 4. మీ పార్టీ మిగిలిన పార్టీల కన్నా ఏ విధంగా భిన్నంగా వుండబోతున్నది, కొత్త రాజకీయాన్ని సాధించడానికి ఎలాంటి ప్రయత్నం చేస్తుంది?

ఇది చాలా కీలకమైన ప్రశ్న. కేవలం నినాదాలతో మాత్రమే కొత్త రాజకీయం కాదు. మన రాజకీయం తీరు ఎలా వుండాలి అనే అంశంపై రెండు విషయాలు.

1) మన పార్టీ నిర్వహణ ఎట్లావుంది? మన పనితీరు ఎట్లా వుంది?

2) మనం ఏరకమైన విధానాల కోసం ఏ రకంగా ప్రజల్ని బలోపేతం చేయబోతున్నాం? మనం చేపట్టేటువంటి నిర్దిష్టమైన చర్యల వల్ల ఏవిధంగా అనుకున్న లక్ష్యాలు నెరవేరతాయి? ఈ రెండు అంశాలమీద దృష్టి కేంద్రీకరించాలి.

మొట్టమొదటిది; పార్టీ నిర్మాణం, నూటికి నూరుపాళ్ళు ప్రజాస్వామ్య బద్ధంగా వుండాలి. సహజంగానే గ్రామస్థాయిలో మండలస్థాయిలో, జిల్లా స్థాయిలో, రాష్ట్ర

స్థాయిలో అంచెలంచెలుగా ప్రజాస్వామ్య బద్ధంగా నిర్మాణం వుంటుంది. అన్నిపార్టీల నిర్మాణం ప్రజాస్వామ్య బద్ధంగా వుంటున్నాయి అని చెపుతున్నాయి గాని ఎన్నికల విషయంలో పప్పులో కాలు వేస్తున్నాయి. అలా కాకుండా, విధిగా ప్రతి స్థాయిలో కూడా రహస్య బ్యాలెట్ ద్వారా, ఓటింగ్ ద్వారా మాత్రమే నాయకత్వం ఎన్నిక జరగాలి. ఆ ఎన్నికలు జరిపేటటువంటి యంత్రాంగాన్ని కూడా ఎలాగైతే దేశంలో రాజ్యాంగబద్ధంగా ఏర్పాటు చేసుకున్నామో అలాగే పార్టీ రాజ్యాంగం ప్రకారం స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల యంత్రాంగాన్ని పార్టీ లోపల ఏర్పాటు చేసుకోవాలి. ఎన్నికల సమయం రాగానే పార్టీ నాయకత్వం ఆదేశించటం, దాన్ని ఆపటం లాంటవి జరగకుండా ఎన్నికల సంఘం దేశంలో ఎన్నికలను నిర్ణీత సమయంలో నిర్వహిస్తుందో అదే రీతిన సమయం రాగానే ఈ పార్టీ ఎన్నికల యంత్రాంగం కూడా పార్టీ ఎన్నికలకు ఏర్పాట్లు చేసి నిర్వహిస్తుంది.

రెండవది; నిర్ణయాలన్నీ కూడా పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా, పారదర్శకంగా జరిగే ఏర్పాటు వుండాలి.

మూడవది; అగ్రనాయకత్వం ఎన్నిక విస్తృత ప్రాతిపదిక మీద జరగాలి. ఎందుకంటే నిరంకుశత్వం ప్రధానంగా పార్టీల్లో వచ్చేది అగ్రనాయకత్వం దగ్గర, అక్కడినుంచి మిగతా వాళ్ళందరిమీద ప్రభావం వుంటుంది. కాబట్టి అగ్రనాయకత్వం ఎంపికలో నూటికి నూరుపాళ్ళు జాగ్రత్తగా వుండాలి. మామూలు జాగ్రత్త కంటే ఎక్కువగా వుండాలి. వీలున్నంత విస్తృత ప్రాతిపదికన ఎన్నికలు జరిపించాలి.

నాలుగోది; పదవుల్లో ముఖ్యంగా అగ్రనాయకత్వంలో వున్నవాళ్ళని అవసరమైతే దింపేందుకు పార్టీ నిర్మాణంలోనే పార్టీ రాజ్యాంగ బద్ధంగా స్పష్టమైన ఏర్పాట్లు వుండాలి. ఉదా॥ బ్రిటన్‌లో మార్గరేట్ థాచర్‌ని అధికారం నుంచి దించటంకోసమని వారు చట్టబద్ధంగా పార్టీ లోపల ఏర్పాట్లు ఉపయోగించుకుని ఆవిడని దింపేశారు. ఆవిడమీద విశ్వాసం పోయిందని తగినంత మంది సంతకం పెట్టగానే మళ్ళీ ఎన్నిక కావడానికి అవకాశం వచ్చింది. ఆ ఎన్నికలో ఆవిడకి మెజారిటీ ఓట్లు వచ్చాయి. సభ్యుల్లో మెజారిటీ వచ్చినా కూడా మెజారిటీని మించి15% వాళ్ళకి ఓట్లు రావాలని నిర్ణయం పెట్టటం చేత అధికారంలో వున్నవాళ్ళకి అంత రాకపోవడం చేత ఆవిడని దింపవలసివచ్చింది. ఆ విధంగా కొన్ని స్పష్టమైన ఏర్పాట్లు చేసుకోవాలి.

అంటే అధికారంలో వున్న వాళ్ళ దౌర్జన్యాన్ని, అహంకారాన్ని, నిరంకుశత్వాన్ని నిరోధించడం కోసం మనం సంస్థాగతంగా ఏర్పాట్లు చేసుకోవాలి. బలమైన ఏర్పాట్లు

చేసుకోవాలి. దానికి మించి పార్టీ అభ్యర్థుల ఎంపిక అధిష్టానవర్గం అనే పేరుతోనో, పార్టీ నాయకత్వం అనే పేరుతోనో చేయడం కాకుండా పార్టీ సభ్యులు, లేకపోతే పార్టీలో ప్రతినిధులు రహస్య బ్యాలెట్ ద్వారా ఎంపిక చేసేటట్లుగా పార్టీలో ఏర్పాటు వుండాలి. దాన్నికూడా మళ్ళీ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన యంత్రాంగం ద్వారా జరిపించాలి.

ఇక పార్టీ నిధుల విషయంలో నూటికి నూరుపాళ్ళు, చెక్కురూపం ద్వారా తీసుకోవటం. పార్టీకి విరాళాలు ఇచ్చేవారికి పన్ను రాయితీలు వున్నాయి. చట్టం దాన్ని నిర్దేశిస్తుంది. పార్టీ నిధులను నూటికి నూరుపాళ్ళు చట్టబద్ధమైన పనులకోసం ఖర్చుపెట్టడం. ఇవ్వాళ ఎన్నికల్లో అవుతున్న ఖర్చు చట్టబద్ధమైన పనులకోసం కాదు. అక్రమమైన పనులకోసం, ఓటును కొనటంకోసం, బూత్‌లను ఆక్రమించుకోవటం కోసం, కొన్ని చోట్ల గూండాలను పెట్టడంకోసం, ఎన్నికల్లో పనిచేస్తున్న అధికారుల్ని వశపరచుకుని వారికి లంచాలు ఇవ్వడం కోసం ఖర్చుపెడుతున్నారు. అలాకాకుండా నూటికి నూరుపాళ్ళు పారదర్శకమైన రీతిలో చట్టబద్ధమైన కార్యకలాపాలకి, స్వచ్ఛమైన రాజకీయంలో చేయవలసిన కార్యక్రమాలకి మాత్రమే వెచ్చించేటట్లుగా వుండాలి. ప్రతి రూపాయికీ లెక్కలు వుండాలి. ఈ దేశంలో ఇప్పటిదాకా జరగని తీరులో, రాజకీయాలు ఏరకంగా నడవాలో ఆరకమైన తీరులో ఏర్పాట్లు చేసుకోవాలి. లేకపోయినట్లయితే మనం సమస్యలో భాగం అవుతాం.

ఇక రెండో భాగం పార్టీ రోజువారీ నిర్వహణ. ప్రస్తుతం పార్టీ నిర్వహణ అంటే ఈ పార్టీని ఆపార్టీ, ఆపార్టీని ఈపార్టీ తిట్టడం, నోటికి ఉచ్చరించడానికి వీలుకాని పరుషమైన పదజాలం వాడడం అన్నమాట. సత్యం, అసత్యం అన్న తేడా లేకుండా అబద్ధాన్ని అలవోకగా చెప్పేయటం, భ్రమలు కల్పించటం, హింసకి పాల్పడటం, ఏదోరకంగా రెచ్చగొట్టడం, కవ్వింపు ధోరణి, అంటే సమాజంలో చట్టబద్ధమైన పౌరులు ఏవి చేయకూడదో, అవి చేయడమే రాజకీయంగా చెలామణి అవుతున్నది. దీనికి పూర్తిగా దూరంగా వుండాలి. ఏ అంశాలు జన జీవితానికి అవసరం.! ఏ జనహితాన్ని రాజకీయం ప్రభావితం చెయ్యాలో ఆ అంశం చుట్టూ, జనజీవనం చుట్టూ రాజకీయాన్ని నడపాలి. ఉదా॥ విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన కోసం తగినటువంటి నైపుణ్యాన్ని యువతకు కల్పించటం గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయాన్ని గణనీయంగా పెంచే ఏర్పాట్లు చెయ్యటం, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల్ని ముఖ్యంగా రవాణా సౌకర్యాన్ని కల్పించి, ఆర్థిక వ్యవస్థ కల్పించినటువంటి విఘ్నాన్ని ఆపడం, పోలీసు నేర న్యాయవ్యవస్థని బాగుచేయటం, జిల్లా ప్రభుత్వాలు ఏర్పాటు చేయటం, ప్రతి కుటుంబానికి విధిగా

ఇళ్ళ స్థలము లేదా ఆస్తి వుండేటట్టుగా, వారి గృహ కల్పనకోసం వినూత్నమైనటువంటి ఏర్పాట్లు చెయ్యడం, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఏర్పాటు చేయడం ఇలా జన జీవనానికి సంబంధించిన అంశాల చుట్టూ నిర్దిష్టమైన పద్ధతిలో రాజకీయాన్ని తిప్పాలి. ఈఅంశాల ఆధారంగా గ్రామ స్థాయినుంచి నిర్మాణాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

రాజకీయాన్ని మనం హుందాగా నడపాలి. ఒకరు తిడితే లోక్‌సత్తా పార్టీ తిట్టేది లేదు. ఇతరులు ఎన్ని తిట్టినా కూడా, ఎన్ని దూషణాలు వచ్చినా కూడా వాటిని భూషణలుగా భావించాలి. మనం వాటిని పట్టించుకోకుండా వుండాలి. గౌతమ బుద్ధుడిని ఎవరో అడిగారట, ఏమండి ఫలానా ఆయన మిమ్మల్ని తిట్టాడట, మీరు నవ్వి ఊరుకున్నారు ఏమిటి అని. ఆయన అన్నారట, నాయనా! నువ్వునాకు ఒక బహుమానమిస్తావనుకో నేను ఆ బహుమానాన్ని స్వీకరించలేదనుకో అదేమవుతుంది అన్నారట, బహుమానం నాదగ్గరే వుంటుంది స్వామీ అన్నాడట. అలాగే నువ్వు తిట్టావనుకో నేను ఆ తిట్టును స్వీకరించటంలేదు, ఆ తిట్టుకూడా నీదగ్గరే వుండిపోతుంది నాకేంచేస్తుంది అన్నాడట. అలాగే మనం దాన్ని పట్టించుకోరాదు. అంశాల మీద విమర్శ చేసినట్టయితే, సిద్ధాంతాలమీద, పార్టీ కార్యక్రమాల మీద విమర్శ చేసినట్లయితే వాస్తవాలను ప్రజలముందు పెట్టవలసిన బాధ్యత మనమీద వుంది. అంతకు మించి వ్యక్తిగతమైన గందరగోళం కాని, పార్టీలను తిట్టిపోయటం గానీ, ఉండకూడదు. ప్రతిపార్టీ కూడా వాళ్ళకు తోచిన రీతిలో ప్రజాస్వామ్యాన్ని బాగు చేయాలనే ప్రయత్నిస్తున్నాయి. కాకపోతే, విషవలయంలో చిక్కుకుపోయారు కాబట్టి వారు అనుకున్నంత, మనం కోరినంత చేయలేకపోవచ్చు. అంచేత వారి ఉద్దేశాలను మనం తిట్టక్కర్లేదు. విధానాల విషయంలో మాత్రం, స్పష్టంగా మన భావాలను చెబుతాం. వారు మన విధానాల విషయంలో కాని, సత్యాసత్యాల విషయంలో కాని, వాస్తవాల విషయంలోకాని, మన భావాలని వారు వక్రీకరించినట్లయితే, దానివల్ల ప్రజలకు అన్యాయం జరుగుతుంది, ప్రజల దృష్టిలో తప్పు సంకేతం వెళుతుందనిపిస్తే వివరణ ఇవ్వటం మాత్రం మన బాధ్యత. అంతకుమించి ఈ తిట్లాటలు మనం చేయకూడదు. ఇలా ఒక వినూత్నమైన రాజకీయ సంస్కృతిని మనం సృష్టించాలి. జవహర్‌లాల్ నెహ్రూ గారు ఆయన పార్టీకి చెందిన అభ్యర్థి అవినీతిపరుడు అని తెలిసిన తరువాత లోక్‌సభ ఎన్నికల్లో ఆ నియోజకవర్గానికి ఆయన పనిగట్టుకు ప్రచారానికి వెళ్ళి అక్కడ వేదిక మీద నుండి పొరపాటున మా పార్టీ ఇలాంటి వాణ్ణి అభ్యర్ధిగా పెట్టింది. అతడు అనర్హుడు కాబట్టి అతణ్ణి ఓడించండి అని ప్రజలకు

విజ్ఞప్తి చేశారు. అది ఉదాత్తమైన రాజకీయం. అలాంటి రాజకీయ వాతావరణాన్ని మనం సృష్టించగలగాలి

## 5. అవినీతిపరులు, అవకాశ వాదులు, మీ పార్టీలోకి రాకుండా వుండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ఇప్పటికే స్పష్టంగా మనం చెప్పాం. "అయ్యా! ప్రజాస్వామ్యాన్ని మార్చాలి. నిజమైన ప్రజాస్వామ్యాన్ని స్థాపించాలి. రాజకీయాన్ని మార్చాలి. కొత్తరాజకీయ సంస్కృతికి మనం పునాది వేయాలి. ఆ అవసరమున్నది అనిచెప్పి, గుర్తించిన వారంతా కూడా మీకు మనసున్నట్లయితే మంచి చరిత్ర, నడవడి మీకున్నట్టయితే, మంచి భావాలుండి దీనికోసం కృషిచేద్దామన్న సంకల్పం మీకున్నట్టయితే దయచేసి మీరు ముందుకు రండి. పార్టీలో ఉండొచ్చు, పార్టీ బయట ఉండొచ్చు. అలాగే ప్రస్తుత రాజకీయ సంస్కృతిలో పూర్తిగా మిళితమైపోయి, సమస్యలో భాగం అయిపోయి, అవినీతి, అక్రమాలకు పాల్పడటం, అశ్రితపక్షపాతం ఇవే రాజకీయంగా చెలామణి అవుతున్నప్పుడు, ఆ రకమైన రాజకీయం చేస్తూ దానికే అలవాటుపడ్డవాళ్ళు, మీరు ఎంతమంచివాళ్ళయినా కూడా మీవల్ల కొత్త రాజకీయ సంస్కృతికి పునాది వేయడం సాధ్యంకాదు. కాబట్టి మీరు దూరంగా ఉండండి, భంగ పడబోకండి'' అని పిలుపునిచ్చాం. కాబట్టి ఎవరు వచ్చినా కూడా వారి నడవడి, వారి చిత్తశుద్ధి, వారి సామర్థ్యం, జన సామాన్యానికి న్యాయం జరగాలి. ఈ దేశంలో కులంతో, కుటుంబంతో నిమిత్తం లేకుండా అందరికి ఎదిగే అవకాశం దొరకాలి అన్నవిషయం మీద వారికి నిబద్ధత... ఈ ప్రాతిపదికపై మనం వారిని తీసుకోవాలి. ఎన్నికల ఖర్చువిషయంలో, నిధులు విషయంలో ఇప్పటికే స్పష్టంగా చెప్పాము. అదే చాలామందిని దూరంగా ఉంచుతుంది. పొరపాట్లు జరిగితే వెంటనే క్రమశిక్షణా చర్యలు తీసుకుని వారిని బయటకు పంపించే ఏర్పాట్లు మనం చేయాలి. ఒకరిద్దరు తెలియకో తెలిసో ఇందులో చేరినట్లయితే నిరోధించటానికి సంస్థాగతంగా, ప్రజాస్వామ్య బద్ధమైన పద్ధతులను ఏర్పాటు చేస్తే నూటికి నూరుపాళ్ళు సక్సెస్ కాకపోవచ్చు. కాని నూటికి 95 పాళ్ళు విజయం సాధిస్తామన్న విశ్వాసం పూర్తిగా నాకు వుంది.

## 6. తెలంగాణా పై పార్టీ వైఖరి ఏమిటి?

లోక్‌సత్తా ఉద్యమం ఈ అంశంపై గతంలో ఎన్నోసార్లు చెప్పటం జరిగింది. మనదేశంలో ఒక సగటు జిల్లా కూడా ప్రపంచంలో సగం దేశాల కంటే కూడా

జనాభారీత్యా పెద్దది. అలాంటప్పుడు కొన్ని జిల్లాలు కలిసి ఒక రాష్ట్రంగా ఏర్పడాలి. మాకు రాజకీయంగా ప్రత్యేకమైన ఉనికి కావాలి. మా అవసరాలు మేం తీర్చుకోవటం కోసం పూర్తిగా మాదృష్టిని మాసమస్య మీద కేంద్రీకరించే అవకాశం ఉండాలని జనం కోరుకున్నట్లయితే రాజ్యాంగబద్దంగా ప్రశాంతంగా, దాన్ని చట్టబద్దంగా ఏర్పాటు చేసుకోవచ్చు. అసలు సమస్య ఈ జన జీవితాన్ని బాగుచేయడం ఎట్లా? రాజకీయాన్ని ప్రజలకు పనికొచ్చేటట్లుగా మార్చడం ఎలా? పుట్టుకతో నిమిత్తం లేకుండా వారికి ఎదిగే అవకాశం కల్పించటం ఎట్లా? సంపద సృష్టిలో వారికి భాగస్వామ్యం కల్పించటమెట్లా? ప్రతి తరానికి కూడా మేము మా శక్తి సామర్ధ్యాలకి, ఆశలకి, మేం చేసే కృషికి అనుగుణంగా మంచి ఫలితాలను సాధించగలుగుతాం, మా జీవితాల్ని బాగుచేసుకోగలుగుతాం. అన్న విశ్వాసాన్ని కలగజేయటం ఎట్లా? దానిమీద దృష్టి సారిస్తే ప్రత్యేక రాష్ట్రం ఉన్నా, లేకపోయినా, అందరికీ మంచి విద్య అందటం, అందరికీ ఉచితంగా మంచి ప్రమాణాలు గల ఆరోగ్యం సులభంగా అందుబాటులోకి రావటం, ఈ దేశంలో అందరికీ ఆర్థిక సంపద సృష్టిలో పాలుపంచుకునే అవకాశం కల్పించడం, మౌలిక సదుపాయాలు కల్పించటం, అవినీతిని అంతమొందించటం ఇవన్నీ జరిగితీరాలి.ఇందుకోసం ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వాన్ని , గ్రామ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడికక్కడ గ్రామ ప్రభుత్వాలు, పట్టణ ప్రభుత్వాలు,మండల ప్రభుత్వాలు ఉండాలి. అక్కడే ప్రజలకు అందుబాటులో పరిపాలన జరగాలి. ఇవన్నీ కావాలని అనుకున్నప్పుడు వాటికోసం తక్షణ ఏర్పాట్లు జరగాలి. కేవలం రాజధాని మారినంత మాత్రంచేత, లేకపోతే మరి రాష్ట్రం మారినంత మాత్రం చేత, లేకపోతే ముఖ్యమంత్రి మారినంత మాత్రంచేత, ఒక క్యాబినెట్ నుండి మరో కేబినెట్ మారినంత మాత్రంచేత పరిస్థితి ఏం మారదు. ఈ రాచరికపు వాసనలు, ఈ భూస్వామ్య సంస్కృతి, ఈ అవినీతి రాజకీయం, ఇవన్నీ కూడా ఇలానే కొనసాగుతుంటాయి. మనం ప్రత్యేక రాష్ట్రం కావాలంటే తెచ్చుకుందాం. ప్రజలు కావాలంటే జరుగుతుంది. రాజ్యాంగబద్దంగా ప్రక్రియ ఉంది. కానీ, అది వచ్చినా రాకపోయినా కూడా మన ప్రజల జీవితాలు జీవితాలను మెరుగుపర్చుకోవడం ఎలాగో మనం ఆలోచించుకోవాలి.

## 7. 610 జివో పై లోక్‌సత్తా వైఖరి ఏమిటి?

ఈ రాష్ట్రంలో గతంలో ఉన్న చారిత్రక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రాంతాలకి న్యాయం చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రధానంగా నిజాం పరిపాలనలో ఉన్నటువంటి -తెలంగాణ ప్రాంతంలో న్యాయం జరగటం కోసం, ఉద్యోగాల

విషయంలో ఆ ప్రాంత వాసులకే ఉద్యోగాలు కల్పించాలి అన్న స్పష్టమైన నిర్ణయం తీసుకోవటం జరిగింది. ఎట్టి పరిస్థితుల్లోను ఆ నిర్ణయానికి ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, ప్రభుత్వం బయట, లోపల ఖచ్చితంగా కట్టుబడి వుండాలి. నిర్థిష్టమైన కాలపరిమితి పెట్టుకుని - 3నెలల కాలంలో, 6 నెలల కాలంలో - దీనికి పరిష్కారాలు చూపెడతామని ప్రభుత్వాలు, పార్టీలు ముందుకు వచ్చి-ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించి తెలంగాణా ప్రాంతంలో వున్నవారికి ఏ ఉద్యోగాలైతే వారికి పూర్తిగా అర్హత వుంటుందని మనం చట్టబద్ధంగా, లేకపోతే ఒక నైతికంగా హామీ ఇచ్చామో, ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయో వాటిని నూటికి నూరుపాళ్ళు అమలు చేసే ఏర్పాట్లు చేయవలసిన బాధ్యత మనమీదుంది. దానిలో ఎలాంటి షరతులకి ఆస్కారం లేదు. ఏరకంగాను శషబిషలు ధర్మం కాదు. ఆరకంగా ప్రజల్లో, దూరం అవుతున్నటువంటి సామరస్యాన్ని పెంచాలి. 610 జివో ను ఖచ్చితంగా అమలు చేయాలి. ఇది అమలు చేయటం, మిగతా ప్రాంతాల ప్రజలకి, ఉద్యోగుల ప్రయోజనాలకు భంగం కలగకుండా చేయటం పూర్తిగా సాధ్యం. 9 లక్షలమంది ఉద్యోగులు ఉన్నటువంటి రాష్ట్రంలో పాతిక, ముప్పైవేల మంది ఉద్యోగుల విషయంలో బేదాభిప్రాయం వచ్చినట్లయితే వారిని సమర్థించుకు రావడం అనేది మనకు ఒకరోజులో సాధ్యం కాకపోయినా కొన్ని నెలల్లో, కొన్ని సంవత్సరాల్లో పూర్తిగా సాధ్యం. దానికి క్రమబద్ధమైనటువంటి ఏర్పాటుచేసి వెంటనే పరిష్కరించాలి. ఒక వెయ్యి రెండువేల కేసుల్లో పరిష్కారం సాధ్యంకాకపోతే దానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేయడం పూర్తిగా మనచేతుల్లో వుంది. ఏమాత్రం అనుమానం లేదు. మనసు వుండాలే కాని జి.వోఅమలు చేయడం పూర్తిగా ప్రభుత్వం చేతుల్లో వుంది.

## 8. తెలంగాణా సాగునీటి ప్రాజెక్టులు పై లోక్‌సత్తా వైఖరి ఏమిటి?

మొట్టమొదట మనం గుర్తించవలసింది, ఈ దేశంలో, ఈ రాష్ట్రంలో పడే ప్రతినీటిచుక్క ప్రజలకోసం సద్వినియోగం కావాలి. ఎందుకంటే ఋతుపవనాల మీద ఆధారపడినటువంటి దేశం మనది. కాబట్టి పెద్ద రిజర్వాయర్ల ద్వారా వరదనీటిని సంరక్షించే ఏర్పాట్లు అవసరం. ఈ రాష్ట్రంలో, ఈదేశంలో మనం కేవలం వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవటం వల్ల మాత్రమే సాగునీటి అవసరాలు తీర్చలేము. వర్షపునీరు సద్వినియోగం, భూసార పరీక్షల కోసం ఏర్పాట్లు, వాటర్‌షెడ్ పథకాలు ఎంతో అవసరం. కానీ వీటివల్ల మాత్రమే మన వ్యవసాయానికి, సాగునీటికి, పరిశ్రమల నీటికి ఏర్పాట్లు చేయగలం అనుకుంటే పొరపాటు. ఇది మొట్టమొదట

గుర్తించాల్సినటువంటి అంశం.

ఇక రెండవది: ఈ అవసరాన్ని గుర్తించి ఇలాంటి పథకాలు చేపట్టినప్పుడు ఇప్పటిదాకా నీటి వనరులు వున్నా కూడా సద్వినియోగం కాకుండా వున్న ప్రాంతాల్లో ఎక్కువ కేంద్రీకరించటం, అక్కడ సద్వినియోగం అయ్యే ఏర్పాట్లు చేయడం, కచ్చితంగా అవసరం.

మూడవది: మిగిలిన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లయితే, అక్కడ నీటి వాడకం గనక ప్రస్తుతం వాడుకుంటున్న దానికంటే తగ్గే అవకాశం వుంటే, ఆ మినహాయించిన నీటిని పై ప్రాంతాల్లో వున్న పొలాలకు వాడవచ్చు, అక్కడున్న ప్రజలు వాడుకోవచ్చు అన్నట్లయితే వాటికి ప్రాధాన్యత ఇవ్వడం అవసరం.

నాలుగోది: మనకు ప్రత్యేకంగా వున్న సమస్య ఏమిటంటే ప్రధానంగా మనకు ఉపయోగపడేది క్రిష్ణానది. క్రిష్ణానది జలాలు చాలా మట్టుకు ఉపయోగిస్తున్నాం. ఇంకా కొద్దిగా ఉన్నా వాటిని కూడా ఉపయోగించవచ్చు. క్రింది ప్రాంతాల్లో నీరు పైనించి ఎక్కువగా వెళ్ళవలసిన అవసరం లేకుండా దానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవచ్చు. ఆ నీటిని మళ్ళీ పై ప్రాంతాల్లో అటు తెలంగాణా ఇటు రాయలసీమకి తరలించే ఏర్పాటు చేసుకోవచ్చు. నాగార్జున సాగర్‌ని, శ్రీశైలాన్ని, తెలుగు గంగ ప్రాజెక్టులు గానీ మిగతావి గానీ. ఇప్పటికే దాదాపుగా మన రాష్ట్ర వాటాని మనం వాడుకునే పరిస్థితిలో వున్నాం. అదనంగా వరదనీరు గనక వచ్చినట్లయితే అప్పుడు అదనంగా వాడుకోవచ్చు. గోదావరి జలాలు పుష్కలంగా లభించినా కూడా మనం పూర్తిగా వాడుకోలేని దశలో వున్నాం. ప్రధాన కారణం కేవలం ప్రాజెక్టులు లేకపోవడం మాత్రమే కాదు. గోదావరి నది ఒక పెద్ద లోయలో ప్రవహిస్తున్నది. అంటే చుట్టూ వున్నటువంటి భూములకన్నా గోదావరి లోతున వుండడం చేత పెద్దడ్యాములు కట్టినట్లయితే అంతర్రాష్ట్ర వివాదాల్లో చిక్కుకుంటాం. నా దృష్టిలో ఇచ్ఛంపల్లి దగ్గర ప్రాజెక్టు రావాలి. ఎలాగైతే ఎన్ని ఇబ్బందులు వున్నా కూడా మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్తాన్, కలిసి నర్మద డ్యామ్ కడుతున్నాయో, మనం కూడా ఆ రకంగానే నీటి వినియోగం మనకున్నా కూడా, విద్యుత్ వినియోగం మిగిలిన రాష్ట్రాలకి ఇచ్చే ఏర్పాటు చేసి ఎంత కష్టమయినా కూడా ఇచ్ఛంపల్లి ని సాధించాలి.

దానితోపాటు మిగతా ప్రాజెక్టులను మనం ఖచ్చితంగా చేపట్టాలి. అవి చేపట్టినప్పటికీ కూడా మనకి గోదావరి లోతున ప్రవహిస్తున్నందు వల్ల నీరు పైకి వచ్చినా కూడా నదికి రెండుపక్కల కూడా ఒక రిబ్బన్‌లాగా కొంత ప్రాంతానికి మాత్రమే

భూమి ఆకర్షణతో నీరు  అందించగలం.  ఎత్తిపోతలు లేకుండా క్రిష్ణా నదిలాగ లక్షలాది ఎకరాలకి నీరు అందే మార్గం లేదు. ఎత్తిపోతలు అంటేనేమో ఎకరానికి వేలాది రూపాయలు బహుశా పదుల వేల రూపాయలు ఖర్చు  కావచ్చు.  అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ  ఫలితాలు  వచ్చే మార్గం కోసం  ప్రత్యామ్నాయాన్ని ఆలోచించాలి.  నదులలో నీటి నిల్వకు ఏర్పాట్లు చేయాలి.  ఎత్తిపోతల పథకాలు కష్టం అనుకుంటే ఆ నీటి వల్ల భూగర్భ జలం పెరుగుతుంది కాబట్టి  భూగర్భజలం వినియోగం కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలి.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉన్నట్లయితే డ్రిప్ ఇరిగేషన్ గాని, మరొకటి గాని ప్రభుత్వం నుండి పెద్దఎత్తున సబ్సిడీలు ఇవ్వాలి.  వచ్చినటువంటి కొద్దిపాటి ఉత్పత్తి, లేకపోతే పెద్దపాటి ఉత్పత్తి దాన్ని సద్వినియోగం చేసి ఆదాయాలు పెంచడం కోసమని వ్యవసాయానుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయాలి.  నీటిపారుదలకు ఎంత ఏర్పాట్లు చేసినా కానీ, నీరు వచ్చే అవకాశం లేనప్పుడు, ఖర్చు మరీ పెరిగిపోతుంది అని అనుకున్నప్పుడు అక్కడ ప్రత్యామ్నాయంగా ఆ నీటిని పరిశ్రమలకి వినియోగించుకునే ఏర్పాట్లు చెయ్యాలి.  ఉదాహరణకి మూసీనది, కృష్ణానదిలో కలిసే చోట నల్గొండ జిల్లాలో మంచి పారిశ్రామిక వాడను ఏర్పాటు చేయవచ్చు.  ఆ నీటిని  వ్యవసాయం కోసం వినియోగించుకోనక్కరలేదు.  మూసీనదిలో వరదలొచ్చినప్పుడు నీరు వృధాగా పోతున్నది, నాగార్జునసాగర్ దిగువన, ఆ నీటిని మనం వినియోగించుకోవడం లేదు. హైదరాబాదులో వర్షం కురిస్తే ఆ నీరంతా వృధాగా సముద్రంలో కలిసిపోతుంది. అక్కడ చిన్న డ్యాం కట్టి వేలాది ఎకరాలలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయవచ్చు. లక్షలాది మందికి ఉపాధి కల్పించవచ్చు.  అలాగే మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాల మధ్య కృష్ణానది రోడ్ క్రాస్ చేస్తుంది.  అక్కడ మహబూబ్‌నగర్ జిల్లాకు పనికొచ్చేటట్లుగా, పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసినట్లయితే, కృష్ణానది నుండి ఎత్తిపోతలు ఏర్పాటు చేసి వ్యవసాయం కోసం సరిపడా నీళ్ళు లేకపోయినా, పరిశ్రమలకు సరిపడా నీళ్ళు ఉంటాయి.  అలాగే లోయర్ మానేరు డ్యామ్   లోని ప్రభుత్వం చేపట్టే ప్రాజెక్టుల వలన ఎక్కువ నీరు చేరే అవకాశం ఉంది.  అక్కడ కరీంనగర్‌లో కావచ్చు, వరంగల్‌లో కావచ్చు పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేయవచ్చు. ఈ నీటి వనరుల్ని వ్యవసాయం కోసం మాత్రమే కాదు, త్రాగునీటి కోసం మాత్రమే కాదు, పారిశ్రామిక ప్రగతి కోసం కూడా వినియోగించుకోవచ్చు.  నేను ఒకప్పుడు నీటికోసం పథకాలు రూపొందించాను, (ప్రభుత్వం లో ఉన్నప్పుడు). దాన్ని పట్టించుకునే నాధుడే లేడు.

కాగితాల మీద తప్ప అమలు చేయడంలో చిత్తశుద్ధి లేదు. ప్రాజెక్టుల కాంట్రాక్టులు తనవాళ్ళకు ఇప్పించుకోవడం, పర్సంటేజీల మీద ఉన్న శ్రద్ధ ప్రజల మీద లేకపోవడం చేత మనం నష్టపోతున్నాం. అవసరమైతే మన రాష్ట్రం, పక్క రాష్ట్రాలు కూడా కలిసి వచ్చి, ఇద్దరి ప్రయోజనాలు కాపాడేటట్లుగా అనేక పథకాలు సాధించవచ్చు.

## 9. సబ్సిడీలపై లోక్‌సత్తా విధానం ఏమిటి?

సమస్య ఏమిటంటే పన్నుల రూపంలో కాని, అప్పుల రూపంలో కాని ప్రభుత్వానికి సమకూరే డబ్బు పరిమితంగా ఉంటుంది. ఆ డబ్బునే అనేక కార్యక్రమాలకు వినియోగించాలి. కొంతడబ్బు విధిగా జీతభత్యాలకి, ప్రభుత్వ నిర్వహణకి, సైన్యానికి, గతంలో చేసిన అప్పులు తీర్చడానికి, వాటికి వడ్డీలు చెల్లించడానికి ఖర్చుచేయాలి. దానినెవరూ ఆపలేరు. మిగిలిన డబ్బు ఏరకంగా ఉపయోగిస్తున్నాం. ప్రభుత్వం ఖర్చు చేస్తున్నది ప్రధానంగా అప్పుతెచ్చిన డబ్బు. మన కుటుంబంలో అయితే అప్పుచేసి పప్పు కూడు తింటామా? అప్పుచేసిన డబ్బుతో ఆస్తులు కొని పిల్లల భవిష్యత్తుని కాపాడతామా? కుటుంబానికి వర్తించేదే, ప్రభుత్వానికి కూడా వర్తిస్తుంది. ఆ నేపథ్యంలో మనం చూడవలసింది ఏమిటి అంటే, ప్రధానంగా కొన్ని రంగాలలో సబ్సిడీలు అవసరం. సామాన్యుల బ్రతుకు భారం కాస్త తేలిక కావాలంటే, ఈ రోజుల్లో సగటుమనిషికి ఇబ్బందులు తగ్గాలి అంటే సబ్సిడీలు అవసరం. అయితే ఎక్కడ సబ్సిడీలు ఉండాలి, ఎక్కడ ఉండకూడదు అనే విషయం జాగ్రత్తగా ఆలోచించాలి. ఉదాహరణకి సామాన్యులు విద్యకోసం బోలెడంత ఖర్చుపెడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్య సరిగాలేక ప్రైవేటు పాఠశాలలయితే పిల్లలు బాగుపడతారనే ఆశతో పేదలు కూడా ఒక్కొక్క బిడ్డకి నెలకు రెండుమూడు వందల రూపాయలు తమ పిల్లల చదువుకోసం ఖర్చు పెడుతున్నారు. తీరా చూస్తే ఎంతడబ్బు ఖర్చుపెట్టినా కూడా ఆ పిల్లలు నూటికి 90 మంది పనికిరాకుండా పోతున్నారు. అలాంటి సందర్భంలో ప్రభుత్వం విద్యకోసం హెచ్చుగా నిధులు కేటాయించి, మంచి ప్రమాణాలుగల విద్యను అందించే ఏర్పాట్లు చేయాలి. అలాగే ఆరోగ్యం కోసం బాగా నిధులను కేటాయించి, ప్రజలకు వైద్యసేవలు కచ్చితంగా అందే ఏర్పాట్లు చేసి ప్రజలమీద భారం తగ్గించడం ఒక పద్ధతి. ఈ దేశంలో ఇప్పటికే మరుగుదొడ్లకన్నా, టి.వి.లసంఖ్య ఎక్కువ. ఇంట్లో పారిశుద్ధ్యం, మహిళలకు గౌరవం, పెద్దవారికి సౌకర్యం కంటే, టెలివిజన్ చూడటం ముఖ్యమనుకునే మన ప్రజలకి ప్రభుత్వం కలర్ టెలివిజన్‌కు డబ్బులు ఇస్తానని మభ్యపెట్టినట్లయితే,(తమిళనాడులో మొన్న డి.యమ్.కె. వాగ్దానం చేసినట్లు.) అది

ప్రజలను మరింత మోసం చేయడం అవుతుంది. ఇలాంటి సబ్సిడీలను ఎలాంటి పరిస్థితులలో మనం హర్షించకూడదు.

మరికొన్ని సబ్సిడీలు ఉంటాయి. ఉదాహరణకి రెండు రూపాయల బియ్యం. లేదా ఉచిత విద్యుత్తు. దాన్లో కూడా మనం చేయవలసింది ఏమిటంటే ఉచితవిద్యుత్‌కి, లేకపోతే రెండురూపాయల బియ్యానికి సబ్సిడీ ఇస్తూనే, సబ్సిడీ ఇచ్చే తీరు మరింత ప్రయోజనకరంగా ఉండేలా చూడాలి. విద్యుత్‌ను వ్యవసాయరంగానికి, పేదల గృహ అవసరాలకి కచ్చితంగా కమర్షియల్ ధర కన్నా తక్కువ ధరకి అందవల్సిందే. అదివాళ్ళ జీవనరేఖల్ని కాస్త మెరుగుపరుస్తుంది. అప్పుడు చేయవలసింది ఏమిటంటే అనవసరంగా విద్యుత్ వృధాకాకుండా, విద్యుత్ పంపిణీ సరిగా ఉండడం కోసం మీటర్లు పెట్టాలి. కొన్ని ప్రమాణాల మేరకు వ్యవసాయ విద్యుత్ వాడకంలో 1500-2000 యూనిట్లవరకు రైతులకు ఉచితంగా ఇవ్వడానికి, ఆపైన చాలా తక్కువ ధరకి యూనిట్ 10 పైసలకు, ఇంకా ఆపైనకూడా అవసరమైనట్లయితే కొంత ఎక్కువ రేటుకి అందించే ఏర్పాట్లు చేయాలి. అప్పుడు విద్యుత్ వృథా తగ్గుతుంది. ప్రస్తుతం మొత్తం విద్యుత్‌రంగంలో ఎంత విద్యుత్ వృధా అవుతోంది, దానిని అరికట్టే మార్గాలు ఏమిటి? చౌర్యం ఎంత జరుగుతోంది, మొదలైనవి తెలుసుకోవడానికి, పరిష్కారాలు కనుగొనడానికి సాధ్యం అవుతుంది. అలాకాకుండా సమాజం పట్ల ప్రేమ అని చెబుతూ, మీటర్లు లేవు, ఇంకేమీ లేవు మొత్తం ఉచితం అంటే అది వ్యవస్థ విధ్వంసానికి కారణం అవుతుంది.

సబ్సిడీలు కనుక అనవసరంగా నిరుత్పాదకంగా పోతున్నట్లయితే, అర్హత లేనివారికి సబ్సిడీలు పోతున్నట్లయితే ఆడబ్బుని ఆదా చేసుకోవాలి. అనవసర సబ్సిడీలు తగ్గించడానికి, దానిని ఉత్పాదకత వైపుకు మరల్చడానికి నిర్మాణాత్మక పరిష్కారాలు ఉన్నాయి. కానీ, నేటి రాజకీయం, ప్రజల్ని ఏదో రకంగా మభ్యపెట్టి ఓట్లు దండుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోంది. ఈ డబ్బు సద్వినియోగం అయి ప్రజల జీవితాలు బాగుపడాలనే కోరిక లేదు కాబట్టి ప్రస్తుత రాజకీయం దానిగురించి ఆలోచించడంలేదు.

## 10. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ, ప్రపంచ బ్యాంకు విధానాలపై మీ వైఖరి ఏమిటి?

'లోక్‌సత్తా' వైఖరి ఏమిటంటే అసలు ఒక అంశాన్ని ఎవరు చెప్పారు అన్నది మనకు ముఖ్యం కానే కాదు. ప్రజలకి పనికొచ్చేది, దేశానికి అవసరమయింది, సంపద పెంచేది, ప్రజలలో ఉన్న శక్తి సామర్థ్యాలను పెంచేది, అలాంటి పని చేయాలని ఎవరు చెప్పినాసరే,

సామాన్య మానవుడు చెప్పినా, బిచ్చగాడు చెప్పినా కూడా మనం చేయాల్సిందే. ప్రజలకు పనికిరానిది, భవిష్యత్తుని నాశనం చేసేది, దుబారాని ప్రోత్సహించేది, అవినీతిని పెంచేది, ఎవరు చెప్పినా సరే, ప్రధానమంత్రి చెప్పినా, రాష్ట్రపతి చెప్పినా, ప్రపంచబ్యాంకు చెప్పినా చేయకూడదు.

గత 70, 80 ఏళ్ళలో మన దేశం అనుభవం, ప్రపంచ దేశాల అనుభవాలు కొన్ని విషయాలను రుజువుచేశాయి. ప్రభుత్వరంగము అంటే ఈదేశంలో (విద్య ఆరోగ్య రంగాలని మినహాయించి,) ప్రజల రంగం అనుకుంటున్నాం, అది చాలా పొరపాటు. ప్రభుత్వరంగం అంటే ప్రభుత్వంలో ఉన్న పెద్దల ప్రైవేట్ రంగం అని అర్థం. అందుకే ఎన్నో ప్రభుత్వ ఆస్తులని వారు, స్వంత ఆస్తులలాగా అనుభవిస్తున్నారు. ఎన్నో ప్రభుత్వరంగ సంస్థలని దివాళా తీయించారు. దివాళా తీయకుండా యాజమాన్యం ఉండాలన్నా ఉండదు, అధికారంలో కూర్చున్నవాడు కోట్లు ఖర్చుపెట్టి ఆపదవిలోకి వచ్చాడు. తిరిగి సంపాదించుకోవాలి కదా! నాయకుల సంపాదనకోసమే ప్రభుత్వం పనిచేస్తోంది. అందుకే మనమంతా కొత్త రాజకీయం కావాలి అంటున్నాం.

ప్రభుత్వరంగం అనగానే గుత్తాధిపత్యం ఉంటుంది. గుత్తాధిపత్యం ఎక్కడ వుంటే అక్కడ దుబారా ఉంటుంది, వేధింపు ఉంటుంది. సేవలు నాసిరకంగా వుంటాయి. ప్రజలని చులకన చేస్తారు. పదేళ్ళ క్రితం టెలిఫోన్ కోసం ఎన్ని కష్టాలు పడ్డారో అందరికీ తెలుసు. పోటీ రావటంతోటే ఏమయింది, ఇప్పుడు ఇంటికొచ్చి అడిగి మరీ తక్కువ ధరకు టెలిఫోన్, సెల్‌ఫోన్ కనెక్షన్లు ఇస్తున్నారు.

పిల్లి నల్లదా, తెల్లదా అన్నది కాదు ముఖ్యం, అది ఎలుకలను పడుతుందా? లేదా? అన్నది ముఖ్యం. మనకు కావాల్సింది తక్కువ ధరతో ఎక్కువ మన్నికతో, ఎక్కువ పోటీతో వినియోగదారుడు రాజుగా ఉండేట్లుగా, ఉత్పత్తిదారుడు ఉత్పత్తి చేయాలి, మనకు అమ్మాలి, మన మాట చెల్లాలి.

ఇక ప్రపంచ బ్యాంకు విధానమో, మరొకటేదయినా, ఆ అంశాన్ని బట్టి, పరిష్కారాన్ని బట్టి మనం నిర్ణయించుకోవాలి. ఈ దేశంలో విద్య, ఆరోగ్యాన్ని ప్రైవేటీకరించాలని దేవుడు చెప్పినా మనం అంగీకరించేది లేదు. ప్రపంచంలో నాగరిక దేశాలలో ఏదేశంలో కూడా విద్యను ఆరోగ్యాన్ని ప్రైవేటీకరించ లేదు. అమెరికాలో ప్రైవేటు రంగంలో విద్యాసంస్థలు ఉన్నాయి కానీ, అవి లాభాలు ఆర్జించే వ్యాపారంగా లేవు. సేవగా భావించి ఆ దేశంలో విద్యాసంస్థలు నడుపుతున్నారు. ఉదాహరణకు మొన్నీమధ్య

బఫెట్‌గాని, బిల్‌గేట్స్‌గాని మనం ఊహించనంత డబ్బు విద్య, ఆరోగ్య రంగాల కోసం విరాళంగా ఇచ్చారు.

మన దేశంలో మనం విద్యను నాశనం చేశాం. లాభసాటి వ్యాపారంగా మార్చాం. మనదేశంలో మెడికల్ కాలేజి సీటు అంటే 30-40 లక్షలు డొనేషన్ వసూలుచేసి, ఆపైన సంవత్సరానికి లక్షరూపాయలదాకా ఫీజులు దండుకుని, ఆఖరికి విద్య ఎలా ఉందంటే ఎందుకూ పనికిరాకుండా ఉంటున్నది. విద్య, ఆరోగ్య రంగంలో ప్రభుత్వం డబ్బు ఖర్చుపెట్టాలి గానీ, అగ్గిపెట్టెల తయారీ పరిశ్రమ కోసం ప్రభుత్వం నిధులు ఖర్చుపెట్టాలి అంటే ఎలా?

అవినీతి తగ్గించాలని ప్రపంచబ్యాంకు వారు అన్నారనుకోండి, ప్రపంచబ్యాంకు చెప్పింది కాబట్టి అవినీతి తగ్గించడానికి వీలులేదు అంటే అది అజ్ఞానం అవుతుంది, చిన్నపిల్లల చేష్ట అవుతుంది. నర్మదా డ్యాం కట్టాలా వద్దా? ప్రపంచ బ్యాంకు వారు వద్దంటున్నారు, వాళ్ళెవరు చెప్పడానికి అందుకని మనం ఊరుకోవాలా? గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర లకు ఉపయోగపడే ప్రాజెక్టును వద్దనడానికి వారెవరు?

కాబట్టి, ప్రపంచబ్యాంకు చెప్పిందా, ఐ.యం.ఎఫ్. చెప్పిందా, ఐక్యరాజ్యసమితి చెప్పిందా, లేకపోతే మనదేశంలో ప్రభుత్వం చెప్పిందా, ఇవన్నీ మనకనవసరం. వాళ్ళు చెప్పింది హేతుబద్ధమైనదా, ధర్మబద్ధమైనదా, దేశానికి పనికొచ్చేదా, కాదా? పనికొచ్చేది, మంచిది అయితే ఎవరో చెప్పారని కాదనవద్దు. పనికి రానిది, చెడ్డది అయితే మనవారు చెప్పారని అవునని అననూవద్దు. వినదగునెవ్వరు చెప్పిన... చివరకు మనం పరిశీలనచేసి, మన ప్రయోజనాల కోసం మనం నిర్ణయాలు తీసుకోవాలి. ప్రపంచంలో చైనాను తీసుకోండి, వారు ఎవరు చెప్పిన మాటకీ తలఊపడంలేదు.ఇతరులు చెప్పారని కాదనడమూలేదు. ఆదేశానికి ఏది మంచి అయితే అదే చేస్తున్నారు. మనం కూడా అలాగే చెయ్యాలి. ప్రపంచంలో ఆత్మగౌరవం ఉన్న ఏ దేశమైనా అలాగే చేస్తుంది.

## 11. నక్సలిజం సమస్యపై లోక్‌సత్తా వైఖరి ఏమిటి?

ఈ సమస్యపై ఇదివరలో చాలా సార్లు లోక్‌సత్తా తన వైఖరి వెల్లడించింది. మండేగుండెలు ఉన్నంతకాలం, పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థలో, సంపద సృష్టిలో ఉపాధిలో పాలుపంచుకునే అవకాశం చాలా మందికి లేనంత కాలం కేవలం పుట్టుక వలన, కుటుంబం వలన, కులం వలన వివక్షకి గురవుతున్నంతకాలం,ఆర్థిక వివక్ష, విద్యా వివక్ష, ఆరోగ్య వివక్ష . . . .ఆర్థికంగా ఎదగడానికి వివక్షతలు ఉన్నంతకాలం,

మండే గుండెలలోంచి హింస పుడుతూనే ఉంటుంది. రాజ్యాంగానికి, చట్టానికి అతీతంగా ప్రవర్తిస్తే చట్టబద్ధంగా ఆ హింసను అదుపు చేయాల్సిందే. హింసను ఎవరూ సమర్థించరు. హింస పరిష్కారం కానేకాదు. హింసకు పాల్పడుతున్నవారిని అణచివేయడం అనేది పరిష్కారం కాదు. హింసకు గల కారణాలను వెదకాలి. ఈ సమాజంలో కోట్లాది మందికి సత్వర న్యాయం, విద్య, ఆరోగ్యం అందకపోవడం, భూమి విషయంలో వారి ఇతర హక్కుల విషయంలోఅలసత్వంచోటు చేసుకోవడం (పట్టాదారు పుస్తకాలు పాతికేళ్ళుగా కబుర్లు చెబుతున్నారు ఇప్పటికీ పూర్తికాలేదు), అర్హత ఉన్న వారికి సబ్సిడీలను, సదుపాయాలను అందించలేకపోవడం, ప్రతి చిన్న పనికి పట్టాదారు పాస్ పుస్తకం దగ్గర నుండి, కులం సర్టిఫికెట్ దాకా లంచం లేకుండా పని జరుగుతుందన్న విశ్వాసం లేకుండా చేశాం. ఇక పొలం విషయంలో తగాదా వచ్చిందన్నట్లయితే ప్రజలు పడే బాధ వర్ణనాతీతం. మనకి 10 వేల రూపాయల నుండి 10 కోట్ల రూపాయల దాకా తగాదా వచ్చినట్లయితే గూండా దగ్గరికి పోవడం, రాజకీయ నాయకుడి దగ్గరకు పోవడం, పోలీసులకు లంచాలు ఇవ్వడం తప్ప చట్టబద్ధంగా తమకు పరిష్కారం దొరుకుతుందన్న నమ్మకం లేకుండా పోయింది. వీటన్నిటినీ పరిష్కరించకుండా, వాటికి స్పష్టమైన విధానాలు రూపొందించకుండా, ఈ దేశంలో హింసను ఆపడం సాధ్యం కాదు. హింసకు గల కారణాలు తొలగించడం, పుట్టుకతో, కులంతో, కుటుంబంతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకు ఎదిగే అవకాశాలను కల్పించడం, దానికోసం రాజ్యవ్యవస్థను పునర్వ్యవస్థీకరించడం అనే అంశాలు లోక్‌సత్తా పార్టీ విధానాలలో ప్రధానమైనవిగా వుంటాయి.

## 12. రిజర్వేషన్లు గురించి లోక్‌సత్తా అభిప్రాయం ఏమిటి?

లోక్‌సత్తా ఉద్యమంలో గత తొమ్మిదేళ్ళుగా ఈ ప్రశ్నకు సమాధానం చెబుతూనే ఉన్నాం. ఇలాంటి వాటిని జిరో సమ్ గైన్ ఇష్యూస్ అంటారు. ఉన్నది వంద రూపాయాలు అనుకోండి మీరూ నేనూ దాన్నిపంచుకోవాలి. నేను 90 తీసుకుంటే మీకు పదే మిగులుతుంది. నేను 10 తీసుకుంటే మీకు 90 మిగులుతుంది. కాబట్టి సహజంగా ఏమిటంటే, ఇద్దరికీ ఎక్కువ తీసుకోవాలని ఆశ ఉన్నప్పుడు, పంచుకోవడంలో తగాదాలు ఎప్పుడూ ఉంటాయి. ప్రతి వర్గం కూడా మేము నష్టపోయామంటే, మేము నష్టపోయామని అంటారు. అది ఈ దేశంలో చాలకాలంగా చూస్తున్నాం. గత తొమ్మిదేళ్ళలో లోక్‌సత్తా నిర్వహించిన దాదాపు అన్ని సమావేశాలలో "రిజర్వేషన్లపై మీ స్పందన ఏమిటి'' అని అడిగారు.

లోక్‌సత్తా చెబుతున్నదేమిటంటే, ఈ సమస్య పరిష్కారం కోసం ఆవేశకావేషాలు పక్కన పెట్టి, కాస్త సావధానంగా, విశాల దృక్పథంతో, ఉద్రేకాలను తగ్గించుకొని, ఆలోచనను పెంచాలి.

భారతీయ సమాజంలో శతాబ్దాల పర్యంతం  కుల వ్యవస్థ దురదృష్టవశాత్తున అంతర్భాగంగా వచ్చింది. ఈ సమాజాన్ని కులాల అంతరాలతో, కృత్రిమమైన అడ్డుగోడలతో నిట్టనిలువునా ఎన్నో రకాలు ముక్కలుగా చీల్చేశారు. కేవలం అనేక తెగలు, ముక్కలుగా  చీల్చడం మాత్రమే కాకుండా, కొన్ని కులాలు ఎక్కువ, మరికొన్ని కులాలు తక్కువ అని సామాజికంగా, సాంఘికంగా  అంతరాలను సృష్టించారు. కొన్ని శతాబ్దాలపాటు వారి ఎదుగుదలకు అనేక అవరోధాలు కల్పించారు. విద్య లేకుండా, సమాజంలో గౌరవం లేకుండా, కొన్ని వృత్తులను  నీచవృత్తులుగా ప్రకటించి, తక్కువ వృత్తులుగా పరిగణించి, ఆ వృత్తుల వారందరూ తక్కువ కులాల వారని, కొన్ని వృత్తులను గొప్ప వృత్తులుగా పరిగణించి,  ఆ వృత్తుల వారందరూ గొప్పవారని ఇలా అంతరాలు పెట్టి, అన్ని రకాలుగా మానసికంగా, శారీరకంగా, సామాజికంగా, ఆర్థికంగా కుళ్ళపొడిచారు. ఇది వాస్తవం. దాని పర్యవసానంగా ఈ నాటికీ కూడా నూటికి 70, 80 మంది పిల్లల భవిష్యత్తు కేవలం పుట్టుక వలన నిర్ణయం అవుతోంది.  ఈ రోజు మనం ఒక బిడ్డ కుటుంబం, కులం, ఆర్థిక పరిస్థితి తెలుసుకుని, ఆ బిడ్డ భవిష్యత్తు ఎలా ఉంటుందో ఊహించి జ్యోతిష్యం రాసినట్లయితే పాతికేళ్ళ తరవాత ఆ జ్యోతిష్యం నూటికి 80 సందర్భాలలో  సరైందే అవుతుంది. అంటే ఏమిటి?  కులం ఈనాటికి కూడా కొన్ని కోట్లమంది బిడ్డల భవిష్యత్తును శాసిస్తున్నమాట వాస్తవం. నిజాయితీగా మనం  దానిని ఒప్పుకోవడం సమస్య పరిష్కారంలో మొదటి మెట్టు అవుతుంది. ఈ దేశంలో జరుగుతున్న పోరాటంలో ఎప్పుడూ కూడా దీనిపట్ల స్పష్టమైన అవగాహన లేదు. మెరిట్, మెరిట్ అంటున్నాం. కొంతమంది పిల్లల్ని ఎయిర్‌కండిషన్ల కార్లలో, పెద్ద పెద్ద ప్రైవేటు స్కూళ్ళకు పంపించి, ఇంటిదగ్గర వాళ్ళ చదువు గురించి పట్టించుకుని మరి కొంతమంది పిల్లల్ని, తక్కువ కులాలని ముద్రవేసి బాధించిన వారి పిల్లల్ని పనికి రాని స్కూల్లో పెట్టించి , వాళ్ళకి విద్యలేకుండా చేసి, ఆ తర్వాత వారిద్దరిని పోటీ పడమని, ఆ పోటీలో  నెగ్గితే మెరిట్ అనడం కంటే  ఆత్మవంచన మరొకటి లేదు. అన్ని కుటుంబాలు, కులాలలో ఎందరో ప్రతిభాశీలురు ఉన్నారు. వారి ప్రతిభ నిరర్థకమైపోతున్నది., నూటికి 70 శాతం జన్యుసంపద ఈ దేశంలో వృధా అయిపోతున్నది.  దాన్లో ఏమీ అనుమానం లేదు. అందునా ప్రభుత్వం పూర్తిగా విఫలం

కావడం చేత జన్యుసంపద వృధా అవుతుంది. ఈ నేపథ్యం లో కులం నేపథ్యంగా రిజర్వేషన్లను మరికొంత కాలం నిర్బంధంగా అమలు చేయవలసిందే. దాన్లో అనుమానం ఏమాత్రం లేదు. అయితే దాంతో మాత్రమే తృప్తి పడి, ఈ కులాలనన్నింటిని బాగుచేశామని భ్రమపెట్టి, వారిని ఓటు బ్యాంకు వర్గాలుగా విభజించి దాంతో రాజకీయం ఆడితే ప్రజల జీవితాలతో జూదం ఆడినట్లే, చదరంగం ఆడినట్లే తప్ప వారి జీవితాలని బాగుచేయడం కాదు. రిజర్వేషన్లతో ఆపకుండా మరికొన్ని చర్యలను చేపట్టాలి.

1. విధిగా అందరికీ విద్య, ఆరోగ్యం మంచి ప్రమాణాలతో అందే ఏర్పాటు చేయాలి. లోక్‌సత్తా ఆదినుంచి చెబుతున్నది, రేపు రాజకీయంగా కూడా పెద్దపీట వేయబోయేది ఈ రెండు రంగాలకే. రాజకీయాన్ని ఈ రెండు రంగాల చుట్టూ తిప్పాలనుకుంటున్నది. అందరికీ మంచి ప్రమాణాలు గల విద్య, ఆరోగ్యం ఉచితంగా అందేటట్లు ఖచ్చితంగా ఏర్పాట్లు చేయాలి. ఊరికే కాగితం మీద చూపెట్టడం కాదు. నినాదాలు ఇవ్వడం కాదు. ఖచ్చితంగా ఇది జరగాలి. రేపు లోక్‌సత్తా జయాపజయాలను ఎలా అంచనా వేస్తారు, అంటే ఈ ఒక్క అంశమే పుట్టుకతో నిమిత్తం లేకుండా అందరికీ మంచి ప్రమాణాలు గల విద్య, ఆరోగ్యం అందించే ఏర్పాట్లు, నూటికి నూరుశాతం వీలుకాకపోవచ్చు. ఈవేళ 20 ఉంటే 70 శాతానికో, 80 శాతానికో తీసుకెళ్ళగలిగామా లేదా,అన్నదే లోక్‌సత్తా జయాపజయాలకు ప్రమాణంగా స్వీకరించాలి.

2. రిజర్వేషన్ల వల్ల ఉన్నత విద్యను పొందే అవకాశం ఉన్న విద్యార్థులకు కేవలం కోటా ఇవ్వడం మాత్రమే కాకుండా, వారికి ముందుగా ఇప్పుడు ఐ.ఏ.యస్., ఐ.పి.యస్., ల కోసం కోచింగ్ ఇస్తున్నట్లు, ఉన్నత విద్యలు అన్నిటికి కూడా మంచి ప్రమాణాలుగల కోచింగ్ ఇవ్వాలి. ఇప్పుడు మంచి మంచి పద్ధతులు వచ్చాయి. ఆడియో, విజువల్ టెక్నిక్స్ వగైరా. వీటిన్నిటి ద్వారా ప్రభుత్వం ఈ వర్గాలకు వెసులుబాటు కల్పించి, ఎంతడబ్బు వెచ్చించి అయినా సరే వారందరికీ పాఠశాల విద్యను బాగు చేయడమే కాకుండా, ఉన్నతవిద్యకు అర్హత పొందేందుకు మంచి శిక్షణా ఇవ్వాలి.

3. బాగా సంపద ఉండి, రిజర్వేషన్ల వలన లబ్ధిపొంది కావచ్చు, వేరేగా అయినా కావచ్చు. రిజర్వేషన్లకు అర్హత వున్న వారిలో డబ్బు ఉన్నవారి పిల్లలకు, మిగిలిన పిల్లలతో సమానంగా ఎదిగే అవకాశం ఉన్న పిల్లలకు ఉదాహరణకు ఒక కలెక్టరు కొడుకో, ఓ మంత్రిగారి కూతురో... పారిశ్రామిక వేత్త పిల్లల్లో... వీళ్ళకు కూడా రిజర్వేషన్లు కల్పించినట్లయితే పేదపిల్లలకు అన్యాయం జరుగుతుంది. ఒక స్థాయికి మించి

ఫలితాలు పొందినా, ఆర్థికంగా ఒకస్థాయికి మించి ఉన్నా కూడా, అయ్యా..మీరు పొందవలసినది పొందారు. ఈ ఫలితం ఇక బీదలకు వచ్చేటట్లు చూడండి అని చెప్పి, పేదలకు అందే ఏర్పాట్లు చేయాలి.

**4.** ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు : రిజర్వేషన్లు పొందని వర్గాల్లో కూడా పేదలు చాలామంది ఉన్నారు. వారికి రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు సాధ్యం కాకపోవచ్చు. ఎందుకంటే ఇది రాజ్యాంగ సమస్య. కేవలం డబ్బులేకపోవడం వలన మా బిడ్డకి విద్య అందలేదు (పాఠశాల కాని, ఉన్నత విద్యలు కానీ) అని ఏ ఒక్కరూ బాధపడకూడదు. ఒక విద్యార్థికి అన్ని అర్హతలు ఉన్నట్లయితే, ఒకపైసా డబ్బు అవసరం లేకుండా వాళ్ళకి ప్రభుత్వం నుండి స్కాలర్‌షిప్పులు అందే ఏర్పాట్లు చేయాలి. ఒకవేళ ప్రభుత్వం అన్నీ చేయలేక పోయినట్లయితే చాలా తక్కువ వడ్డీలకీ, లేదా వడ్డీయే లేకుండా ఆ పిల్లలకి బ్యాంకుల నుండి రుణాలు అందే ఏర్పాట్లు చేసి, ఉద్యోగం వచ్చిన తర్వాత సులభ వాయిదాలలో చెల్లించే ఏర్పాట్లు చేయాలి. డబ్బు లేకపోవడం వలన నేను ఉన్నత విద్యకు దూరం కావలసి వచ్చింది. అనే బాధ ఏ ఒక్కరికి లేకుండా చెయ్యాలి.

ఇవన్నీ చేసిన తర్వాత సంవత్సరానికి ఒకశాతమో, అరశాతమో వంతున రిజర్వేషన్లను క్రమక్రమంగా తగ్గించవచ్చు.

## 13. ఎస్సీల వర్గీకరణ పై మీ అభిప్రాయం ఏమిటి?

ఇది చాలా జటిలమైన సమస్య. ఒక పక్కనేమో వివక్షకు, వంచనకు, దోపిడికి గురైన దళితులంతా ఏకమై పోరాడేట్లుగా ఏర్పాట్లు చేయవలసిన అవసరం ఉంది. రెండో పక్కనేమో ఆ దళితులలోనే కొన్ని ఉపకులాలు, ఉపవర్గాల వారు గణాంకాల ద్వారా చూసినట్లయితే, మాకు అవకాశాలు బాగా తక్కువగా ఉన్నాయి. ఉన్న అవకాశాలలో కూడా ఎక్కువ మళ్ళీ సామాజికంగా కాస్తో కూస్తో మాకంటే ముందున్న వాళ్ళు అనుభవిస్తున్నారు. కాబట్టి మాకు అన్యాయం జరుగుతున్నది. అన్నప్పుడు ఆ సమస్యను విస్మరించడం సాధ్యం కాదు. అప్పుడు రిజర్వేషన్లకు మనం చెబుతున్న ప్రాతిపదిక దెబ్బతింటుంది. మనం హేతుబద్ధంగా ఆలోచించాలి. మూడు పనులు మనం చేపట్టాలి.

మొట్టమెదటిది ఏ వర్గాలైతే రిజర్వేషన్లు పొందుతున్న వారిలో వెనకబడి ఉన్నారో వారి పాఠశాల విద్య కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెట్టాలి. ఫలితాలు రాబట్టాలి. ఉన్నత విద్యకు సంబంధంచి కూడా శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు ఉండాలి. రెండు కొంతకాలం

మేరకైనా సరే, బిసి లలో ఏ విధంగా అయితే వర్గీకరణ ఉన్నదో మన దక్షిణాది రాష్ట్రాలలో, ఎబిసిడిలుగా) అలాంటి ఏర్పాట్లు చేయాలి. ఆ ఏర్పాటు చేసినపుడు పూర్తిగా జనాభా శాతం ఆధారంగా కాకుండా, రెండు వర్గాలకు న్యాయం జరగాలి. కాబట్టి దళితులలో ఎ.బి. అని పెట్టారనుకోండి, ఎ జనాభా 55 శాతం, బి, జనాభా 45 శాతం ఉందనుకోండి, ఎకి, 55, బికి 45 శాతం రిజర్వేషన్లు కాకుండా, అలా ఇస్తే రెండు ముక్కలు చేసినట్లే. ఉన్నవందలో 55 శాతం జనాభాకి 41 శాతం రిజర్వేషన్లు వచ్చే ఏర్పాట్లు చేయండి. 45 శాతం జనాభాకి 30 శాతం 31 శాతం రిజర్వేషన్లు ఇవ్వండి. మిగతా 30, 35 లో ఇద్దరికీ అవకాశం ఉండేలా చేయవచ్చు. ఎస్సీ లని రెండు ముక్కలుగా నిలువునా చీల్చడం కాకుండా, కొంత మనం సర్దుబాటు చేయాల్సి ఉంది. మూడు: ముఖ్యంగా ఉన్నతవిద్యలో, ఉద్యోగాలలో, తర్వాత ఉద్యోగాలలో, శిక్షణలో ఈ అణగారిన వర్గాలలో మరింత అణగారిన వర్గాల వారికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలి. కాలక్రమేణా దళితుల్లో గనుక చాలామంది ఆర్థికంగా సంఘటిత రంగంలో ఉపాధి కల్పించినట్లయితే వాళ్ళ పిల్లలకి కనీసం ఈ ఇబ్బంది లేకుండా చేయవచ్చు.

ఈ మూడు ఏర్పాట్లు చేసినట్లయితే పరిష్కారం దొరుకుతుంది. రెండు వర్గాల మధ్య పోట్లాట పెట్టేసి చప్పట్లు చరచడం కాదు, నిజంగా న్యాయం కోసం లోతుగా ఆలోచించాలి. పరిష్కారాలు సాధించాలి

## 14. ప్రైవేటురంగంలో రిజర్వేషన్ల పై లోక్‌సత్తా వైఖరి ఏమిటి?

లోక్‌సత్తా ఉద్యమంలో మనం దీనిని గురించి చాలా స్పష్టంగా చెప్పాం. దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటు రంగం పాత్ర పెరుగుతున్నది. ఇది ఇంకా పెరుగుతుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా నడుస్తున్న సరళి ఇది జరుగుతున్నది కదా అని, ప్రైవేటు కంపెనీల వారిని మీరు వీళ్ళకి ఉద్యోగాలు ఇచ్చేసేయండి, దళితులు కదా, పేదలుకదా అంటే వారేమంటారు. మాకు పని కావాలి కదండీ, పని చేసే నైపుణ్యం లేని వాళ్ళు మాకెందుకు అంటారు. దీనికి నా జీవితానుభవం నుండి ఒక సంఘటన చెబుతాను. విశాఖ స్టీలుప్లాంటు నిర్మాణం కోసం భూములు వదులుకున్న వారి పిల్లలకు స్టీలు ప్లాంటులో ఉద్యోగాలు ఇవ్వాలని పెద్ద గొడవ నడుస్తున్నది. ఆ సమయంలో నేను స్టీల్‌ప్లాంట్ స్పెషల్ ఆఫీసర్‌గా వెళ్ళాను. భూములు కోల్పోయిన వారి పిల్లలకు ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోతున్నారని అడిగితే, వారికి స్టీల్‌ప్లాంట్‌లో పనిచేసే నైపుణ్యం లేదు అని సమాధానం వచ్చింది. స్టీల్‌ప్లాంట్ లో పనిచెయ్యడానికి ఎలాంటి నైపుణ్యం కలవారు,

ఎంతమంది కావాలి. అని అడిగాను. వారు ఇచ్చిన సమాచారం ప్రకారం, భూములు కోల్పోయిన వారి పిల్లలకు ప్రభుత్వ ఐ.టి.ఐ.లలో, ప్రత్యేకంగా ఏర్పాటు చేయించిన శిక్షణా కేంద్రాలలో, ప్రైవేటు భాగస్వామ్యంతో శిక్షణ ఇప్పించడం జరిగింది. ఆ విధంగా ఎనిమిది వేలమంది యువతకు స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పించాము. దేశ చరిత్రలో నిర్వాసితుల పిల్లలకు ఇంత పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పించిన సందర్భం మరొకటి లేదు.

ప్రైవేటురంగంలో రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వం నాలుగుపనులు చేపట్టాలి.

1. సమాన అవకాశాల కల్పించే చట్టం

ప్రభుత్వం ఒక చట్టం చేయాలి. (ఈక్వల్ ఆపర్చ్యునిటీస్ యాక్ట్) అర్హత ఉన్నప్పటికీ, పనిచేసే నైపుణ్యం ఉన్నప్పటికీ ఉద్యోగాల నియామకాలలో కుల వివక్ష చూపినట్లు ఆధారాలు ఉన్నట్లయితే ఖచ్చితంగా వాళ్ళమీద పెద్ద జరిమానాలు ఉండాలి. ఇంత అంత కాదు, చాలా పెద్ద స్థాయిలో జరిమానాలు ఉండాలి. ఉదాహరణకి ఇన్ఫోసిస్, విప్రో సంస్థలు ఉన్నాయి, సాఫ్ట్‌వేర్‌లో శిక్షణ పొందకుండా మేమేలా ఉద్యోగాలు ఇవ్వగలం అంటారు. కానీ వారిలో ఒక కంపెనీవారు మొత్తం సిబ్బందిలో 15-20% మందిని దళిత కుటుంబాల నుండి, బలహీనవర్గాల కుటుంబాల నుండి తీసుకుంట, అదే రంగంలోని మరొక కంపెనీ వారు 2 శాతం మందిని మాత్రమే తీసుకుంటే అర్థం ఏమిటి. ఒకటే రకమైన పని, ఒకే దేశంలో ఒకే రంగంలో ఇంత తేడా ఉంది అంటే వివక్ష ప్రదర్శిస్తున్నారు అని అర్థం అవుతుంది. కదా! వివక్ష ఆధారాలుంటే శిక్షలు వేయాలి.

2. విధిగా దళితుల పిల్లలందరికీ ఉద్యోగాలకు పనికి వచ్చే శిక్షణ ఇప్పించాలి. ప్రభుత్వం ముందుకు రావాలి, ప్రైవేటు భాగస్వామ్యంతో కలిసి పని చేయాలి.

3. ఇది విజయవంతం కావాలంటే, వచ్చే ఐదు పదేళ్ళలో ఫలానా ఫలానా రంగాలలో, ఎంతెంతమందికి ఉపాధి అవకాశాలు ఉంటాయో (సుమారుగా) పారిశ్రామిక వర్గాలద్వారా తెలుసుకోవాలి. ఆ విషయాలన్ని బయటపెట్టాలి. అప్పుడు ఏ రంగంలో ఎంతమందికి శిక్షణ ఇవ్వాలో తెలుస్తుంది. దీనిలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు పరస్పరం సహకరించుకోవాలి. అది చట్టబద్దంగా ప్రతి కంపెనీ తన భవిష్యత్తు అవసరాలకు ఎంతమంది ఏ ఏ రంగాల నిపుణులు అవసరం అవుతారో (సుమారుగా) చెప్పడం ప్రభుత్వం ఆ సంఖ్యప్రకారం శిక్షణ అందించడం జరగాలి.

4. పౌరసమాజం ముందుకు రావాలి... ప్రైవేటు రంగంలో ఏ కంపెనీ ఎంతమందిని తీసుకుంటోంది. దాన్లో ఏ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దళితులు, బలహీన వర్గాలకు ఎంతమేరకు అవకాశాలు కల్పిస్తున్నారు. అనే వివరాలు బయటపెట్టినట్లయితే మార్కెట్‌ను ఒక మార్గంగా ఉపయోగించుకోవాలి. ఫలానా కంపెనీవారు, అవకాశం ఉన్నా కూడా ఫలానా వర్గాల నుండి ఒక్కరినీ ఉద్యోగంలోకి తీసుకోలేరు. ఫలానా కంపెనీ వారు 12 శాతం మందికి ఇచ్చారు. వివరాలు బయటపెట్టి మార్కెట్ నుండి వత్తిడి తీసుకురావచ్చు. వివక్ష ప్రదర్శించే కంపెనీల వస్తువుల్ని మేము కొనడం మానేస్తాం, అనే వత్తిడి పౌర సమాజం నుండి వచ్చినట్లయితే పరిస్థితిలో మార్పు వస్తుంది. ప్రభుత్వం కూడా వివక్షను పాటించే కంపెనీలకు కాంట్రాక్టులు ఇవ్వడం మానివేయాలి. చట్టబద్ధంగా ప్రభుత్వం, ఉద్యమం ద్వారా పౌర సమాజం మార్కెట్‌ను ప్రభావితం చేసి ఈ రిజర్వేషన్ల అమలుకు కృషి చేయాలి. డబ్బులు పోతాయి అంటే ఏ యాజమాన్యమైనా కచ్చితంగా ఈ తరగతులకు అవకాశాలు కల్పించి తీరుతుంది. ఆ తరగతుల వారికి చదువు చెప్పించి, శిక్షణ ఇప్పించి, తమ తమ కంపెనీలలో ఉద్యోగాలు కల్పిస్తాయి.

ఈ నాలుగు మార్గాలను నిర్మాణాత్మకంగా ఉపయోగించాలి. రెండు చట్టాలు ప్రభుత్వం తీసుకురావాలి. మిగిలిన పని పౌరసమాజం ప్రభుత్వం కలిసి చేయాలి. అలా చేస్తే చాలా మేరకు పరిష్కారం లభిస్తుంది.

## 15. సామాజిక, రాజకీయ రంగాలలో మహిళల అభివృద్ధికి లోక్‌సత్తా పార్టీ ఎలాంటి కృషి చేస్తుంది; ఎలాంటి అవకాశాలు కల్పిస్తుంది?

కులం,బీదరికం- ఈ రెండు వివక్షలలాగానే, కేవలం ఆడపిల్లగా పుట్టటం మన సమాజంలో ఇప్పటికీ వివక్షకి కారణమౌతున్నది. పుట్టుకతో వివక్షకి ఏ బిడ్డాగురికాకుండా చూడటం, అందరికీ ఎదిగే అవకాశాలని కల్పించటం లోక్‌సత్తా పార్టీ మౌలికాశయాలు. ఇందులో భాగంగా మహిళల సంక్షేమానికి, ప్రగతికి నాలుగు కీలక రంగాలలో లోక్‌సత్తా పార్టీ నిర్దిష్ట ప్రణాళికలు అమలు చేస్తుంది.

1. విద్య,ఆరోగ్యం: ప్రతి బాలికకి, విధిగా మంచి ప్రమాణాల పాఠశాల విద్యని అందించటం, ఆసక్తి, అర్హత ఉన్న అందరు యువతులకి ఆర్థిక స్తోమతుతో సంబంధం లేకుండా ఉన్నత విద్య అందించటం, ప్రతి బాలికకి, ప్రతి మహిళకి ఉచితంగా అన్ని విధాలైన ఆరోగ్యానికి-మామూలు వ్యాధులు, వ్యాధినివారణ, ప్రసూతి వైద్యం, బిడ్డల

రక్షణ-ఉచితంగా మంచి ప్రమాణాల సేవలు హక్కుగా అందేలా చట్టబద్ధమైన భద్రతని కల్పించటం, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణాన్ని చేపట్టి బహిరంగ మల విసర్జనని నిర్మూలించటం ఆవిధంగా మహిళలకి సౌకర్యాన్ని , మరుగుని, హుందాతనాన్ని, పరిశుభ్రతని, ఆరోగ్యాన్ని అందించటం.

**2. ఆర్థికరంగం:** ఆస్తిలేని ప్రతి కుటుంబానికి మహిళ పేరుతో విలువపెరిగే పట్టణ ఆస్తిని ఇళ్ల స్థలం రూపంలో విధిగా కేటాయించటం,సమాన వేతన చట్టాన్ని కచ్చితంగా అమలు చేసి ఒకే పనికి ఒకే వేతనం అందే ఏర్పాటు చేయటం, సారాయి త్రాగుడుని కఠినంగానియంత్రించి కుటుంబాల ఆరోగ్యాన్ని, ఆర్థికస్థితిని మెరుగుపరచటం, పొదుపు సంఘాల మహిళలకి పరపతి సౌకర్యంతోపాటు నైపుణ్యాన్ని, మార్కెటింగ్ సౌకర్యాలని కలిగించటం. పేద మహిళలకి ఆదాయం పెంచే అవకాశాలు అందించటం.

**3. సామాజిక రంగం:** కుటుంబకలహాలని మహిళల భద్రతకి ఢోకాలేకుండా సామరస్యంగా పరిష్కరించటానికి కౌన్సెలింగ్ సెంటర్ల ఏర్పాటు,మహిళలకి ఉచిత న్యాయ సహాయం, మహిళలపై జరిగే నేరాలలో త్వరగా న్యాయం అందించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు, కౌమార దశలో ఉన్న బాలికలకి ఆరోగ్యం, వివాహ సంబంధ విషయాలలో అవగాహన పెంచటానికి కౌన్సెలింగ్ సెంటర్ల ఏర్పాటు, విద్య, ఉపాధి అవకాశాల కోసం నగరాలకి వెళ్లే మహిళల రక్షణ, సౌకర్యం కోసం వసతి ఏర్పాట్లు, ఇంట్లో, బయట, పనిచేసేచోట లైంగిక వేధింపులు లేకుండా సురక్షిత వాతావరణాన్ని కల్పించటం.

**4. రాజకీయ రంగం:** స్థానిక ప్రభుత్వాలలో ఎన్నికయ్యే మహిళలకి, పోటీ చేసే మహిళలకి నాయకత్వ శిక్షణకు ఏర్పాట్లు చేస్తుంది;

చట్ట సభలలో మహిళలకి తగిన ప్రాతినిధ్యం లభించేందుకు నిర్దిష్టమైన ఏర్పాట్లు చేస్తుంది.